# ప్రజాశక్తి

సోమవారం 13 అక్టోబర్ 2025

8 పేజీలు

ఎన్టీఆర్

కృష్ణా

# బాబోయ్ కుక్కలు..!

- కృష్ణాలో వీధికుక్కలు స్వైరవిహారం
- ద్విచక్ర వాహనదారులపై దాడి
- ప్రతినెలా వందల్లో బాధితులు
- నియంత్రణ చర్యలు శూన్యం

**ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి**

వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. జనవాసాల మధ్య తిరుగుతూనే వెంటపడి కరుస్తున్నాయి. ఈ ఏడాది తొమ్మిది నెలల పది రోజుల వ్యవధిలో కృష్ణాజిల్లాలో రోజుకు సగటున 26 మంది కుక్కకాటుకు గురయ్యారు. కుక్కకాటకు గురైన వారు రోజుల తరబడి ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోవాల్సి వస్తోంది. కుక్కలు దాడి చేయడంతో ద్విచక్రవాహనదారులు కింద పడి గాయాలపాలవుతున్నారు.

**ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబర్ 10వ తేదీ వరకు కుక్కకాటుకు గురైన వారి సంఖ్య**

| | |
|---|---|
| జనవరి | 1174 |
| ఫిబ్రవరి | 1035 |
| మార్చి | 1017 |
| ఏప్రిల్ | 1020 |
| మే | 911 |
| జూన్ | 801 |
| జులై | 932 |
| అగస్టు | 523 |
| సెప్టెంబర్ | 653 |
| అక్టోబర్ | 197 |
| **మొత్తం** | **8,263** |

ఈ నేపథ్యంలోనే కుక్కలను చూస్తేనే ప్రజలు బెంబేలెత్తిపోయే పరిస్థితి ఏర్పడింది. వీధి కుక్కల నియంత్రణకు స్థానిక సంస్థలు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ నెల ఏడో తేదీన గుడివాడ రామన్నపూడి గ్రామానికి చెందిన ఆరు సంవత్సరాల గూడపాటి మోక్షిత కుక్క కరించింది. తీవ్ర గాయలపాలైన మోక్షితకు గుడివాడ ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందించారు. మచిలీపట్నం నగరపాలక సంస్థలో భాస్కరపురం, రాజుపేట, జగన్నాధపురం ప్రాంతాల్లో ఇటీవల కాలంలో పలువురు కుక్కల దాడికి గురయ్యారు. జిల్లా సర్వజనీన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ రెండు ప్రాంతాల్లోనే కాదు... 2025 జనవరి ఒకటి నుంచి అక్టోబర్ 10వ తేదీ వరకు జిల్లాలో 8,263 మంది కుక్క కాటుకు గురయ్యారు. అంటే (మిగతా 2లో)

గుడివాడలో కుక్కల దాడిలో బాలుడికి గాయం (ఫైల్)

# నేటి నుంచి అమరావతి షాపింగ్ ఫెస్టివల్

**ప్రజాశక్తి-విజయవాడ**

జీఎస్టి 2.0 సంస్కరణలతో ప్రజలకు జరుగుతున్న ప్రయోజనాలపై అవగాహన కల్పించే క్రమంలో ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ, జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని పున్నమిఘాట్ – బెరం పార్కులో జరిగే గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్‌పై జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో కలిసి ఆదివారం కలెక్టరేట్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వాణిజ్యం, వినోదానికి వేదికగా నిలిచే షాపింగ్ ఫెస్టివల్‌లో వ్యాపారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, హస్తకళాకారులు.. ఇలా వివిధ వర్గాల వారు తమ స్టాళ్లను ఏర్పాటు చేసి బ్రాండ్ ప్రమోటింగ్ చేసుకోవచ్చన్నారు. వ్యాపార, వాణిజ్య సంస్థలు జీఎస్టీ ప్రయోజనాలు కల్పించడంతో పాటు దీపావళి పండగ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు, రాయితీలు ప్రకటిస్తాయన్నారు. మెగా లక్కీ డ్రాలతో పాటు ఉత్తమ స్టాళ్లకు అవార్డులు కూడా అందించనున్నట్లు వెల్లడించారు. దాదాపు వంద స్టాళ్లతో ఏర్పాటు చేసే ఈ ఫెస్ట్‌లో జీఎస్టీ సంస్కరణల ఫలాలపై మేధోమథన చర్చలు, సమావేశాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ భాగస్వాములై ఈ ఫెస్ట్‌ను విజయవంతం చేయాలని, స్థానిక వ్యాపారులు, ప్రజలు ఫెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ జహీర్, అసిస్టెంట్ కమిషనర్ ప్రజ్ఞా రాధిక, జిల్లా పరిశ్రమల అధికారి పి.మధు తదితరులు పాల్గొన్నారు.


అంగట్లో అన్నీ కల్తీ.. 4లో ▲

వర్తమాన సమస్యలకు ప్రతిబింబంగా కవిత్వం 8లో ▲


# అమరావతి కేంద్రంగా యోగా అకాడమీ

రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం గౌరవాధ్యక్షుడు గొట్టిపాటి

వార్త 2లో

యోగా పోటీల్లో విజేతలను అభినందిస్తున్న గొట్టిపాటి

# ఇంద్రకీలాద్రిపై కిడ్నాప్‌కు యత్నం

## బాలుడిని కాపాడిన ఎఎస్ఐ

**ప్రజాశక్తి-విజయవాడ సిటీ:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఓ బాలుడిని కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించగా ఫైర్ విభాగంలో విధులు నిర్వహించే ఎఎస్ఐ దానిని అడ్డుకున్నారు. దుర్గగుడిలో ఆదివారం చోటు చేసుకున్న ఈ సంఘటన కలకలం రేపింది. జగ్గయ్యపేటకు చెందిన లావణ్య తన నాలుగేళ్ల కుమారుడు శశి వజ్ర ఆరూష్‌తో కలిసి దుర్గమ్మ దర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం ఏడవ అంతస్తులో ఉన్న సమయంలో ఆరూష్ తల్లికి దూరమయ్యాడు. లావణ్య తన కుమారుడి కోసం మూడు గంటల పాటు ఆలయ ప్రాంగణంలో వెతికారు. ఇదే సమయంలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఫైర్ డిపార్ట్‌మెంట్ ఏఎస్ఐ సత్యనారాయణ అమ్మవారి దర్శనానికి వచ్చారు. లిఫ్ట్ వద్దకు వెళ్తున్న క్రమంలో ఇద్దరు వ్యక్తులు ఒక బాలుడిని బలవంతంగా తీసుకెళ్తుండగా, ఆ బాలుడు గట్టిగా ఏడుస్తూ కనిపించాడు. అనుమానం వచ్చిన ఎఎస్ఐ ఆ వ్యక్తులను ప్రశ్నించారు. దీంతో బెంబేలెత్తిన ఆ ఇద్దరు బాలుడిని అక్కడే వదిలి పారిపోయారు. ఎఎస్ఐ బాలుడిని తీసుకుని ఆలయ కార్యనిర్వహణాధికారి శీనానాయక్, దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణను కలిశారు. అధికారులు వెంటనే స్పందించి బాలుడి తల్లి లావణ్యకు బాలుడిని సురక్షితంగా అప్పగించారు. సమయస్ఫూర్తితో బాలుడిని కాపాడిన ఎఎస్ఐను పలువురు అభినందించారు.

బాలుడిని తల్లికి అప్పగిస్తున్న అధికారులు

# కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్‌కుమార్
- సిఐటియు ఎన్టీఆర్ జిల్లా మహాసభలు ప్రారంభం

**ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తోన్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. కొండపల్లిలోని విటిపిఎస్ బి కాలనీ ఆడిటోరియం (మన్నెం డేవిడ్ నగర్) ఆవరణలో రెండు రోజుల పాటు జరగనున్న సిఐటియు ఎన్టీఆర్ జిల్లా 12వ మహాసభలు ఆదివారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని సిఐటియు అనుబంధ కార్మిక సంఘాల ప్రతినిధులు మహాసభకు హాజరయ్యారు. ముందుగా సిఐటియు పతాకాన్ని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లి నరసింహారావు ఆవిష్కరించారు. తొలుత కార్మిక నాయకులు దేవిడ్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రారంభ సభలో అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా కార్మికుల పని గంటల్లో మార్పులు తీసుకొచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులు హరించే విధంగా కార్మిక చట్టాల్లో మార్పులు తీసుకొచ్చిందని విమర్శించారు. దీని పర్యవసానంగా భవిష్యత్తులో కార్మికులు కాంట్రాక్ట్ కార్మికులు, కాల వ్యవధి కార్మికులుగా మిగిలిపోతారని చెప్పారు. కార్మిక సంక్షేమం విషయంలో ప్రపంచమంతా ఒక రకమైన విధానం అమలవుతుందని, దేశంలో మాత్రం ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అమలంభిస్తున్నాయని తెలిపారు. కార్మికులకు అమలవుతున్న వారానికి 36 గంటల పని విధానానికి స్వస్తి పలికి 48 గంటల పని విధానం అమల్లోకి తీసుకు రాబోతున్నారని తెలిపారు. కార్మిక వ్యతిరేక విధానాలపై మిగతా కార్మిక సంఘాలను కూడగట్టుకుని పెద్ద ఎత్తున కార్మికుల పక్షాన పోరాడటానికి సిఐటియు సిద్ధంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం కార్మికులకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, విద్యుత్ రంగంలో ఉద్యోగుల సమస్యలు (మిగతా 2లో)

మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్‌కుమార్

సిఐటియు పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహారావు

కార్యదర్శి నివేదిక ప్రవేశపెడుతున్న శ్రీనివాస్

# ఎంబి స్టేడియం ఆధునీకరణ పనులు చేపట్టాలి

## • డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

**ప్రజాశక్తి-విజయవాడ:** సింగ్‌నగర్‌లోని మాకినేని బసవ పున్నయ్య స్టేడియాన్ని క్రీడాకారులు, వాకర్స్ వినియోగానికి వీలుగా ఆధునీకరించాలని డివైఎఫ్ఐ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎస్‌కె నిజాముద్దీన్ కోరారు. ఆదివారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో బ్యానర్‌పై సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా నిజాముద్దీన్ మాట్లాడుతూ స్టేడియంలో ప్రైవేట్, ఇతర కార్యక్రమాలకు తరచూ ఇవ్వటం వల్ల స్టేడియం గ్రౌండ్ అంతా గోతులమయంగా మారిపోయి, క్రీడాకారులు, వాకర్స్‌కు అనుకూలంగా లేదన్నారు. కొద్దిపాటి వర్షానికి నీరు నిలబడి, ఆ నీటిని బయటికి తరలించేందుకు వీఎంసి చర్యలు తీసుకోవట్లేదన్నారు. నగరపాలక సంస్థలోని అధికార వైసిపి, టిడిపికి స్టేడియం అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదన్నారు. నగరపాలక సంస్థలో కమ్యూనిస్టులు అధికారంలో ఉన్నప్పుడు డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్న బాబూరావు ఆనాడు కౌన్సిల్‌లో పెట్టిన ప్రతిపాదనతో స్టేడియం నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. సింగ్‌నగర్, పాయకాపురం పేద ప్రజల పిల్లలు, వద్దుల సదుపాయం కోసం ఉచితంగా స్టేడియాన్ని వినియోగించుకోవాలనే ఆలోచనతో స్టేడియం నిర్మాణం జరిగిందన్నారు. నేడు అధికారంలో ఉన్న వైసిపి పాలకపక్షం, స్థానిక ఎమ్మెల్యే స్టేడియం ఆధునీకరించడం, అభివృద్ధిపై దృష్టి పెట్టకపోవడం విచారకరమన్నారు. స్టేడియం వాకర్లు, క్రీడాకారుల వినియోగానికి వీలుగా లేదని, స్టేడియంలోని గోతులు పూడ్పించి, నీరు నిలబడకుండా

చర్యలు తీసుకోవాలని కోరారు. స్టేడియం మెరక కోసం డస్ట్ పోయించి లెవలింగ్ చేయించాలని కోరారు. వాకర్లు వర్షాకాలంలో కూడా నడవడానికి వీలుగా వాకింగ్ ట్రాక్‌ను బ్రిక్స్‌తో ఏర్పాటు చేయాలని కోరారు. స్టేడియం అవసరాలకనుగుణంగా బాత్ రూమ్‌లను కొత్తవి నిర్మించాలని, మంచి నీళ్ల ట్యాప్‌లు స్టేడియంలో నాలుగు చోట్ల ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 58వ డివిజన్ డివైఎఫ్ఐ కార్యదర్శి రసూల్, నాయకులు రోహిత్, శ్యామ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి కేంద్రంగా యోగా అకాడమీ ఏర్పాటు

## • రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం గౌరవాధ్యక్షుడు గొట్టిపాటి
## • యోగాసనలో పతకాలు పొందిన క్రీడాకారులకు అభినందన

**ప్రజాశక్తి-ఎడ్యుకేషన్:** యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఇటీవల విజయవాడలో నిర్వహించిన 6వ జాతీయ జూనియర్, సీనియర్-సి యోగాసన ఛాంపియన్‌షిప్ తమలో కొత్త ఉత్తేజాన్ని, ప్రోత్సాహాన్ని నింపిందని అదే స్ఫూర్తితో అమరావతి కేంద్రంగా యోగా అకాడమీ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం గౌరవాధ్యక్షుడు గొట్టిపాటి వెంకట రామకృష్ణప్రసాద్ తెలిపారు. ఆదివారం ఉదయం టీచర్స్ కాలనీ సాయిబాబా టెంపుల్ స్ట్రీట్‌లో ఉన్న సాయి జ్యూయల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో గొట్టిపాటి మాట్లాడుతూ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 6వ యోగాసన ఛాంపియన్ షిప్ 2025-26 పోటీలు సబ్ జూనియర్స్ 10 నుండి 14 సంవత్సరాల బాలబాలికలకు అనంతపురం జిల్లాలో డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు ఇందులో పాల్గొంటారని తద్వారా పోటీల్లో గెలుపొందిన విజేతలు జనవరి 5, 6, 7, 8 తేదీల్లో యోగాసనా భారత్ పేరిట మహారాష్ట్రలో జరిగే నేషనల్ పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. ఈ ఏడాది సెప్టెంబర్ 28, 29, 30 అక్టోబర్ 1 తేదీల్లో విజయవాడలో నిర్వహించిన 6వ జాతీయ యోగాసనా చాంపియన్‌షిప్ 2025-26 జూనియర్స్ మరియు సీనియర్ సి లో హ్యాండ్ బ్యాలెన్స్ ఆసనాల్లో మహిళ విభాగంలో నెల్లూరుకు చెందిన పి.ప్రసూనకు స్వర్ణం, తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఎ.సుజాతకు రజిత పతకం లభించాయన్నారు. అలాగే చత్తీస్‌ఘడ్‌లో సెప్టెంబర్ 13, 14, 15, 16 తేదీలలో నిర్వహించిన సీనియర్ ఏ మహిళా విభాగంలో విజయవాడకు చెందిన శిరీషకు ప్రథమ బహుమతి వచ్చిందన్నారు. ఈ నెల 13 నుండి 18వ తేదీ వరకు పోలీస్ నేషనల్ యోగాసన పోటీలు 2025-26 అమరావతిలో విట్ యూనివర్సిటీలో జరుగుతాయని తెలిపారు. ఈ సమావేశంలో యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు ఎ.రాధిక, ప్రధాన కార్యదర్శి పి.ప్రేమ్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు కొంగర సాయి, భారత్ స్వాభిమాన ట్రస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.దుర్గారావు, ఏపి టీమ్ మేనేజర్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 6వ జాతీయ యోగాసనా చాంపియన్‌షిప్‌లో స్వర్ణ, రజిత పతకాలు సాధించి క్రీడాకారులను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. యాపిల్ ఎలివేటర్స్ తరపున విజేతలకు రూ.5 వేలు చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేశారు.

## 15 నుంచి నిరవధిక సమ్మె

### ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ

**విజయవాడ:** విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు, జెఎల్ఎం గ్రేడ్-2 సమస్యల పరిష్కారానికి ఈ నెల 15వ తేదీ నుండి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. విద్యుత్ కార్మిక వర్గ శ్రేయస్సు కోసం, సంస్థ పరిరక్షణకై కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం అయ్యే వరకు పోరాటాన్ని కొనసాగించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు, స్ట్రగుల్ కమిటీ డిస్కం నాయకులు డి.వెంకటేశ్వరరావు, ఎల్.రాజు పేర్కొన్నారు. కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేసే వరకు, వన్ ఇండస్ట్రీ వన్ సర్వీస్ రెగ్యులేషన్స్ ఇంప్లిమెంట్ చేసి గ్రేడ్.2 కార్మికులకు న్యాయం చేసే వరకు ,పాత పెన్షన్ పద్ధతిని పునరుద్ధరించే వరకు పోరాటాలు కొనసాగించాలన్నారు. కారుణ్య నియామకాల్లో జరుగుతున్న అన్యాయాన్ని నివారించాలని, నగదురహిత అపరిమిత మెడికల్ పాలసీని వర్తింపజేయాలని, కాంట్రాక్టు కార్మికులకు కోటి రూపాయలు ఇన్సూరెన్స్ చేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మిక వర్గ శ్రేయస్సు, సమస్యల పరిష్కారమయ్యే వరకు, ప్రైవేటీకరణ విధానాల నుండి సంస్థను రక్షించుకోవాలని, విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే బిల్లుకు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

### రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

**ప్రజాశక్తి-విజయవాడ:** పోలీసు కమిషనరేట్ పరిధిలోని అన్నీ పోలీసు స్టేషన్ల, టాస్క్ ఫోర్స్ కార్యాలయంలో ఆయా పోలీసు అధికారులు వారి సిబ్బందితో కలిసి రౌడీషీటర్లకు, లా అండ్ ఆర్డర్, క్రైమ్ సస్పెక్ట్‌లకు చెడునడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలని కోరారు.

**మొదటిపేజీ తరువాయి**

## బాబోయ్ కుక్కలు..!

నెలకు సగటున 826 మందిని రోజుకు 27 మంది కుక్కలు పీకుతున్నాయి. బాధితులు పిహెచ్‌సిలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల్లో గాయాలకు చికిత్స తీసుకోవడంతో పాటు కుక్కకాటుకు గురైన వారికి వచ్చే ర్యాబిస్ వ్యాధి సోకకుండా ఇంజక్షన్‌లు తీసుకుంటున్నారు. కుక్కల దాడిలో వాహనదారులు సైతం కిందపడి గాయాలపాలవుతున్నారు. పెడన మండలం కొంకేపూడి వద్ద ఇటీవల ద్విచక్ర వాహనదారులను కుక్కలు వెంబడించాయి. వాహనం అదుపుతప్పి ఇదకదరు రోడ్డుపై పడిపోయారు. స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించారు.

**నియంత్రణకు చర్యలు శూన్యం**

జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో వీధి కుక్కలను నియంత్రించేందుకు స్థానిక సంస్థలు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కుక్కలను పట్టుకుని ఎప్పటికప్పుడు జనావాసాలకు దూరంగా తరలించాలి. పిల్లలు పుట్టకుండా నియంత్రించడానికి కుక్కలకు స్టెరిలైజేషన్ చేయాలి. స్థానిక సంస్థలు నిర్లక్ష్యంగా వీటి నియంత్రణకు చర్యలు తీసుకోకపోవడంతో కుక్కలు సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. ఒకదాన్ని చూసి ఒకటి మొరుగుతూ వాటిలో అవి కరుచుకుంటూ ప్రజలపైనా దాడి చేస్తున్నాయి. ఈ క్రమంలో వీటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు

పరిష్కరించాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, 22వ పిఆర్సి అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభలో ఎన్‌టిఆర్ జిల్లా ఉపాధ్యక్షులు పాత్రుడు సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా కార్యదర్శి నివేదికను జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ సిహెచ్ శ్రీనివాస్ ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు డివి కష్ణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏ వెంకటేశ్వరరావు, ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ మామిడి సీతారామారావు, ఆహ్వాన సంఘం కార్యదర్శి యం మహేష్, కోశాధికారి వాసుదేవన్, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు వెనిగళ్ల మురళీమోహన్, జిల్లా రైతు సంఘం కార్యదర్శి పివి ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎన్ సిహెచ్ సుప్రజ, మైలవరం మండల కార్యదర్శి సుధాకర్, జెవివి జిల్లా ఉపాధ్యక్షులు పెట్ల కామేశ్వరరావు, సిఐటియు నాయకులు, కాశీనాథ్, ఇర్లా కొండలరావు, షాబీ, పాపయ్య, బాబీ, తదితరులు పాల్గొన్నారు.

## మామూళ్ల దందా

### గుడివాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి !

**ప్రజాశక్తి-గుడివాడ :** ప్రజల ఆస్తి రక్షణ కోసం ఉండాల్సిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇప్పుడు మామూళ్ల దందాకు కేంద్రంగా మారింది. ప్రజలకు అనవసర ఇబ్బందులు సృష్టిస్తూ, దళారుల సహాయంతో బహిరంగంగా మామూళ్లు వసూలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ కార్యాలయంలో రెండు కీలక స్థానాలు సబ్-రిజిస్ట్రార్-1, 2 ఉన్నప్పటికీ, వాస్తవానికి గతంలో అన్ని అధికారాలను సబ్-రిజిస్ట్రార్-2 కైవసం చేసుకున్నట్లు వినికిడి. సబ్-రిజిస్ట్రార్-1ను పూర్తిగా పక్కన పెట్టి, అన్ని ముఖ్యమైన రిజిస్ట్రేషన్లు, ఫైల్ క్లియరెన్స్, పెద్ద మొత్తాల లావాదేవీలను తన ఆధీనంలోకి తీసుకున్నట్లు సమాచారం. రూ.15 లక్షలు పైబడిన రిజిస్ట్రేషన్లకు ఒక శాతం కమిషన్, రూ.10 లక్షల్లోపు రిజిస్ట్రేషన్లకు కనీసం 10 వేల రూపాయలు, రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల్లోపు రిజిస్ట్రేషన్లకు 15 వేల రూపాయలు దళారుల ద్వారా బహిరంగంగానే వసూలు చేస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే ఫైళ్లు ఉద్దేశపూర్వకంగా వాయిదా వేస్తున్నారని బాధితులు చెబుతున్నారు. 'ఒక చిన్న ఇల్లు రిజిస్టర్ చేసుకోవాలంటేనే 10 వేల రూపాయలు డిమాండ్ చేస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే ఫైల్ నిలిపేస్తారు. మేము అప్పు చేసి అయినా డబ్బులు ఇవ్వాల్సి వస్తోంది' అని ఒక పేద రైతు చెప్పాడు. 'రిజిస్ట్రేషన్ ఫీజులు ప్రభుత్వానికి వేరుగా చెల్లించాలి. కానీ దళారులకు మరోసారి డబ్బులు ఇవ్వక తప్పదు. ఈ అక్రమాలు బహిరంగంగానే జరుగుతున్నాయి' అని మరో బాధితుడు వాపోయాడు. దీనిపై ప్రభుత్వం విచారించి చర్యలు తీసుకోవాలని, ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలని పలువురు కోరుతున్నారు.

## మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలి

### - డాక్టర్ మణి అక్కినేని

**ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ:** అక్కినేని హాస్పిటల్స్ మహిళల ఆరోగ్య రంగంలో వినూత్నమైన కార్యక్రమాలను ప్రారంభిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా గైనకాలజిస్టులకు ఆధారిత వైద్య సేవలను అందిస్తుందని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ మణి అక్కినేని అన్నారు. నగరంలోని హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో మొదటి సారిగా హ్యాండ్స్ ఆన్ కాస్మెటిక్ గైనిక్ అనే అంశంపై ఇంటర్నేషనల్ ఫెలోషిప్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ వర్క్ షాప్‌లో అంతర్జాతీయ స్థాయి వైద్య నిపుణులు పాల్గొని సూతన అంశాలపై తెలియచేశారని అన్నారు. ఈ ఫెలోషిప్, మహిళల ఇంటిమేట్ హెల్త్‌పై అవగాహన పెంచడంలో వైద్య నైపుణ్యాన్ని అభివృద్ధి చేయడంలో కీలకమైన అడుగుగా నిలుస్తోందని తెలిపారు. మహిళల సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య ప్రముఖులు పాల్గొన్నారు.

**పేరు మార్పు**

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఎన్.ఎల్.సుబ్రమణి, C/O లక్ష్మణరావు, డోర్ నెం. 41- 26- 16/1, రజక వీధి, కృష్ణలంక, విజయవాడ, ఎన్‌టిఆర్ జిలాలో నివసిస్తున్న నా పేరు ఎన్.ఎల్.సుబ్రమణి నుండి నీలపు వెంకట సుబ్బయ్యగా మార్చుకుంటున్నాను. కావున పత్రికా ముఖంగా మీ అందరికీ తెలియజేయుచున్నాను.

**IN THE COURT OF THE HON'BLE VII ADDL DISTRICT JUDGE VIJAYAWADA**
**A.S. No.70/2024**

Between:

**1.Sappa Naga Mani,**
**2. Sappa Damodhara Venkata Kalyan,**
**3. Sappa Sridhar,**

**....Appellants**

**AND**

**Patchala Simiyon,**
**S/o.late Israil, Christian,**
**Flat No.S-3, Kinnera Apartments,**
**Anjamma Road, Prajasakthi Nagar.**
**Vijayawada-520010,**

**....Respondent**

In the above mentioned proceedings the Hon'ble Court was pleased to order Notice to the Respondent by way of publication as substitute of service. The above matter is stands posted to 24-10-2025. Hence the Respondent is requested to attend before the above-mentioned Hon'ble Court on 24-10-2025 at 10.30 A.M either in person or through his advocate failing which the matter will be decided exparte.

Vijayawada
Dt.11-10-2025

**Ch.Manmadha Rao,**
**Smt.Ch.Nirmalatha,**
**Ch.Sai Saran,**
**Advocates,**
Labbipeta,
Vijayawada-10
Cell.9885 44 3339

లక్ష్మీ హ్యాండ్ లూమ్ వివర్స్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

## ఆర్థిక ఎదుగుదలకు సహకార సంఘాలు దోహదం : కాగిత

**ప్రజాశక్తి-గూడూరు :** గూడూరు మండలం రాయవరం గ్రామంలో నూతన లక్ష్మీ హ్యాండ్ లూమ్ వివర్స్ కో ఆపరేటివ్ సొసైటీని పెడన శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులు మన సంప్రదాయం, కళలను కాపాడాలి అన్నారు. ఆర్థికంగా ఎదగటానికి ఇలాంటి సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ప్రభుత్వం చేనేత రంగాన్ని అభివృద్ధి పరిచేందుకు అన్ని విధాలుగా సహకరిస్తుందని పేర్కొన్నారు. సొసైటీ సభ్యులు మున గాల భాస్కర్, మండల టిడిపి అధ్యక్షులు పోతన స్వామి, గోపి నాగబాబు, బట్టు భవనారాయణ, ఎన్ ఏ బేగ్, మున గాల నరసింహారావు, చిన్నం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

టివి ప్రారంభిస్తున్న దృశ్యం

## గ్రంథాలయంలో కంప్యూటర్లు, టివి ప్రారంభం

**ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ :** విద్యార్థి దశలో బాలబాలికలు అవసరమైన మేరకు జ్ఞాన సముపార్జనపై దృష్టి పెట్టాలని జిల్లా కేంద్ర గ్రంథాలయం డిప్యూటీ లైబ్రరీ అధికారి బీరం వెంకటరమణ పేర్కొన్నారు.45వ డివిజన్ ఈడేపల్లి శాఖా గ్రంథాలయం నందు ఆదివారం సూపర్ జీఎస్టీ ఎసూపర్ సేవింగ్స్, జీఎస్టీ రేట్లపై అవగాహన కల్పించడంతోపాటు, శిక్షణ ఫౌండేషన్ విద్యార్థుల కోసం అందజేసిన కంప్యూటర్లు, ఎల్ఈడి టీవీను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా తగ్గించిన జీఎస్టీ రేట్లు అమల్లోకి వచ్చాయని, దీని వల్ల ప్రతి కుటుంబానికి చాలా వరకు ఆదా అవుతుందన్నారు. గ్రంథాలయ నిర్వాహకురాలు కోన వెంకటేశ్వరమ్మ, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

**ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) :** ఇండియన్ యాక్ట్స్ అవేర్నెస్ వాలంటరీ ఆర్గనైజేషన్ యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ సంయుక్తంగా సమాచార హక్కు చట్టం 2005, 20వ ఆవిర్భావ దినోత్సవాన్ని గన్నవరంలోని విశ్వభారతి సైనిక్ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఐఎఎవిఓ రాష్ట్ర చైర్మన్ సయ్యద్ లాల్ సాహెబ్, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యంకి సురేష్ బాబు, యుఎఫ్ఎఫ్ఆర్ టిఐ రాష్ట్ర అధ్యక్షుడు జంపాన శ్రీనివాస్ గౌడ్, పౌర సమాజం ఐక్య వేదిక అధ్యక్షుడు కురగంటి హనుమంతు రావు తదితరులు పాల్గొని మాట్లాడారు. ప్రజలు చట్టంపై మరింత అవగాహన పొందాలని కోరారు. ఈ చట్టం సహాయంతో ప్రజలు అధికారుల నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేసి న్యాయం పొందగలు గుతున్నారని, ప్రజలు ప్రశ్నించే నాడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రతి పౌరుడు చట్టాలను అర్థం చేసుకుని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. పాలకులలో పారదర్శకత లేకపోవడం వలన చట్టాలు సరిగ్గా అమలు కావడం లేదని, సమాచార హక్కు ద్వారా ప్రశ్నించడం వలనే పారదర్శకత వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బేతపూడి జోగేశ్వర రావు, డా. కొత్తపల్లి సత్యం నారాయణ, సి.హెచ్.హేమలత తదితరులు పాల్గొన్నారు.

## పురిటిగడ్డ హైస్కూల్లో టీచర్లను నియమించాలి

**ప్రజాశక్తి-చల్లపల్లి :** చల్లపల్లి మండలం పురిటిగడ్డ ప్రభుత్వ హైస్కూల్ ప్లస్ లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు వెంటనే టీచర్లను నియమించాలని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం పురిటిగడ్డ హైస్కూల్ ప్లస్ విద్యార్థులను సురేష్‌బాబు కలసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురిటిగడ్డ హై స్కూల్ ప్లస్ లో దాదాపు 20 మంది విద్యార్థులు బైపిసి గ్రూపులో ఉన్నారని, వారికి నాలుగు నెలలుగా బొటనీ, జువాలజీ బోధించడానికి టీచర్లు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు కళాశాలలో ఫీజులు కట్టలేక ప్రభుత్వ హైస్కూల్ ప్లస్‌లో చేరిన నిరుపేద విద్యార్థులకు బైపిసి లో ముఖ్యమైన సబ్జెక్టులు బోధించడానికి టీచర్లు లేకపోవడం పట్ల విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. బైపిసి ద్వారా వైద్య విద్య,ఇతర కోర్సులు చదువుదామని ఆశ పడి హై స్కూల్ ప్లస్ ద్వారా బైపీసీ గ్రూపులో చేరిన విద్యార్థుల భవిష్యత్ ఆలోచిస్తుంటే చాలా బాధగా ఉందని విచారణ వ్యక్తం చేశారు. మెగా డిఎస్సీ ద్వారా పిజిటి పోస్టులు కేటాయిస్తారని ఆశించినా ఫలితం లేదన్నారు. నిరుపేద విద్యార్థుల ఆశలను అడియాసలు చేయకుండా ప్రభుత్వం వెంటనే హైస్కూల్ ప్లస్‌కు పూర్తి స్థాయిలో టీచర్లను కేటాయించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని సురేష్ బాబు ప్రభుత్వాన్ని కోరారు.

## ఎంవి కృష్ణారావుకు నివాళి

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** నాడు ఎంవి కష్టారావు ఏర్పాటుచేసిన ఉపాధ్యాయ శిక్షణ స్ఫూర్తితో నేడు దివి తాలూకాలో అత్యధిక సంఖ్యకులు ఉపాధ్యాయులయ్యారని విశ్రాంతి ఉపాధ్యాయులు జీవితాంతరావు అన్నారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి తెలుగు భాష అభివృద్ధి ప్రదాత కీర్తిశేషులు మండలి వెంకటకృష్ణారావు శత జయంతి వేడుకలు నిర్వహించారు. ఆదివారం అవనిగడ్డ వంతెన సెంటర్లో ఎం వి కృష్ణారావు విగ్రహానికి 1976-79 మధ్య అవనిగడ్డ జూనియర్ కళాశాలలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రిగా మండల వెంకటకృష్ణారావు ఏర్పాటుచేసిన టీచర్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా శిక్షణ పొందిన ప్రభుత్వ ఉపాధ్యాయులైన, విశ్రాంతి ఉపాధ్యాయులు, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ,నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్ రామ్ లతో కలిసి పూలదండలు వేసి నివాళులర్పించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాధాకృష్ణ (ఫైల్)

**ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) :** గన్నవరం జాతీయ రహదారిపై కొత్తపేట చైతన్య కటింగ్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముఠా కార్మికుడు గోనెపల్లి రాధాకృష్ణ (47) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గన్నవరంకు చెందిన ముఠా కార్మికుడు గోనేపల్లి రాధాకృష్ణ ప్రతిరోజు కొండపా వులూరు పంచాయతీ శివారు ముదిరాజుపాలెం కు సైకిల్ పై వచ్చి పని చేసుకొని వెళుతుంటాడు. అదే మాదిరిగా ఆదివారం పని ముగించుకుని వెళుతున్న సమయంలో సైకిల్ దిగి నడుపుకుంటూ జాతీయ రహదారి దాటుతుండగా విజయవాడ వైపు నుండి ఏలూరు వైపు వేగంగా వెళ్తున్న లారీ ఢీకొనగా లారీ వెనుక చక్రాలు తల మీద నుండి వెళ్లడంతో తల భాగం నుజ్జు అయ్యి అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు రాధాకృష్ణకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రాధాకృష్ణ 20 సంవత్సరాలుగా ముఠా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ జీవిస్తున్నాడు.

అన్నసమారాధన ప్రారంభిస్తున్న పిన్నమనేని బాబ్జి

## రెండు వేల మందికి అన్నదానం

**ప్రజాశక్తి - గుడివాడ :** గుడివాడ పట్టణం 31వ వార్డు రైల్వే స్టేషన్ రోడ్డులో శ్రీ కనకదుర్గమ్మ భక్త బృందం ఆధ్వర్యంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవ వేడుకలు వైభవంగా ముగియడంతో శాంతి నిమిత్తం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రెండు వేల మందికి అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించిన సీనియర్ టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి భక్తులకు భోజనాన్ని వడ్డిస్తూ సమారాధనను ప్రారంభించారు. ఈ సందర్భంగా పిన్నమనేని బాబ్జి మాట్లాడుతూ 14వ వార్షిక శరన్నవరాత్రుల అన్న సమారాధనల కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు చేకూరు జగన్ మోహన్ రావు, వెనిగండ్ల రాములు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గోకవరపు సునీల్, 31వ వార్డు పెద్దలు బొంబాయి శ్రీను, వెంకట్రావు, చింతపల్లి ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం ) :**గన్నవరం నియోజకవర్గం నుండి ఏడుగురు రోగులకు వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మొత్తం 13 లక్షల రూపాయల ఎల్ఓసిలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మంజూరు చేయించి, ఆదివారం వారి కుటుంబాలకు అందజేశారు. వివిధ కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న ఈ రోగులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంగా గన్నవరం ఎమ్మెల్యే వెంకట్రావు త్వరితంగా స్పందించి సీఎం సహాయనిధి నుండి సహాయం మంజూరు చేయించి బాధితుల కు అందించారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల:** పేదలకు ఆరోగ్యం అందుబాటులో ఉండే విధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం చేస్తున్నారని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. శనివారం పమిడిముక్కల మండలంలోని లంకపల్లి గ్రామంలో అనారోగ్యం కారణం ఆపరేషన్ చేయించుకున్న దోనేపూడి వెంకటేశ్వరరావుకు రూ. 1,20,000 సీఎం ఆఫ్ చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు గంటా సురేష్, కందిమల్ల సుబ్రహ్మణ్యం, మంటాడ వీర రాఘవులు, పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ :** మొవ్వ మండలంలో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. పెదపూడి గ్రామంలో బాదర్ల రాజేశ్వరికి 23,920 రూపాయల చెక్కును, మొవ్వలో వీర్ల నాగపూర్ణ చంద్రరావుకు 47,016రూపాయల చెక్కును, భట్ల పెనుమర్రులో అంగడాల వెంకటేశ్వరరావుకు 30 వేల రూపాయల చెక్కును లబ్ధిదారుల ఇండ్లకు వెళ్ళి అందచేశారు. ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, మండల టిడిపి ప్రధానకార్యదర్శి వీరంకి తులసీదాస్, పిఎసిఎస్ అధ్యక్షులు మండవ రత్నగిరిరావు, బ్యాంకు విశ్రాంత అధికారి మండవ(బుజ్జి )కోటేశ్వరరావు, గ్రామ టిడిపి అధ్యక్షుడు ఈడే నాగేశ్వరరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** పెనమకూరు గ్రామంలో తోట్లవల్లూరు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు వీరపనేని శివరాం ప్రసాద్ చేతుల మీదగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆదివారం అందించారు. ముత్తిరెడ్డి కోటేశ్వరరావుకు రూ. 1,10,000, కాగిత వెంకటేశ్వరమ్మ కు రూ. 45,261 రూపాయల చెక్కులను అందించారు. ఇటీవల వీరు ఇరువురు అనారోగ్య కారణంగా శాస్త్ర చికిత్సలు చేయించుకున్నారు. సీనియర్ నాయకులు గూడపాటి గిరిబాబు, సర్పంచ్ వీరంకి వరహాల రావు, రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు చింతపల్లి వెంకటేశ్వరరావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వీరంకి పరుశురాం, పామర్తి వెంకటరామయ్య పాల్గొన్నారు.

గన్నవరంలో...



పమిడిముక్కల మండలంలో...



తోట్లవల్లూరు మండలంలో...

## హాస్టల్‌కు ఫర్నిచర్ వితరణ

**ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ :** మచిలీపట్నం మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా మైలవరంకు చెందిన బెల్ రిటైర్డ్ ఉద్యోగి మహమ్మద్ భాజా జ్ఞాపకార్థం ఆయన భార్య ఖుర్షిద్ బేగం, కుమార్తె కైసర్ సుల్తానా ఆర్థిక సహకారంతో మచిలీపట్నం నోబుల్ కాలనీలో ఉన్న హ్యాపీ హోం ఫర్ గర్ల్స్ హాస్టల్ కు పదివేల రూపాయల విలువైన ఫర్నిచర్ (8 కుర్చీలు, వుడెన్ బల్ల) వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు వేణుకుమార్ మాట్లాడుతూ ఇలాంటి దాతృత్వ కార్యక్రమాలు మరెందరికో ప్రేరణగా నిలవాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు వరప్రసాద్, గౌరవ సభ్యులు రమణ, బి.వి.రావు పాల్గొన్నారు. హాస్టల్ వార్డెన్ లతాకుమారి, దాత కుటుంబ సభ్యులకు, మచిలీపట్నం మైత్రి ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సంతకాల సేకరణ

**ప్రజాశక్తి -విజయవాడ సిటీ :** పశ్చిమ నియోజకవర్గం పంజా సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ షేక్ బాజీ ఆధ్వర్యంలో ఆదివారం ఓట్ చోర్ - గద్దె చోడ్ నినాదంతో సంతకాల సేకరణ కార్యక్రమం

జరిగింది. ఈ సంతకాల సేకరణకు ప్రజల నుండి అపూర్వ స్పందన లభించింది. ఈ సందర్భంగా షేక్ బాజీ మాట్లాడుతూ ఓట్లను దొంగిలించి అధికారంలోకి రావటం వంటి అనైతిక చర్యలకు పాల్పడుతున్న ఎన్డిఎ ప్రభుత్వాన్ని గద్దెదించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజలు ఉద్యమించాలన్నారు. ఈ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మీసాల రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోడీ ఓటు దొంగతనాన్ని చూసి దేశ ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎపిసిసి జనరల్ సెక్రటరీ బి.నాగేశ్వరరావు, ఎపిసిసి మాజీ సభ్యుడు షేక్ బషీర్, కాంగ్రెస్ పార్టీ 49వ డివిజన్ అధ్యక్షుడు పారా రాజు, వివిధ డివిజన్ల అధ్యక్షులు పాల్గొన్నారు.

## వైసిపి గంపలగూడెం అధ్యక్షునిగా అత్తునూరి

**ప్రజాశక్తి-గంపలగూడెం :** వైసిపి గంపలగూడెం టౌన్ అధ్యక్షుడుగా అత్తనూరి తేజేష్ రెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఆ పార్టీ మాజీ అధ్యక్షుడు కొత్తగుండ్ల నరసింహారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో 40 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు చావా వెంకటేశ్వరరావు, చెరుకు నరసారెడ్డి, జడ్‌పిటిసి సభ్యులు కోటా శామ్యూల్, పాల్గొన్నారు.

## బాణసంచా విక్రయాలకు అనుమతి అవసరం

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమతి లేకుండా బాణసంచా నిల్వ చేసినా, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ హెచ్చరించారు. దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసే షాపులకు అన్ని విభాగాల అనుమతులతో లైసెన్స్ తీసుకొని మాత్రమే ఏర్పాటు చేయాలని సూచించారు. అనుమతి లేకుండా మందుగుండు సామాగ్రిని కలిగి ఉండడం గానీ, అమ్మడం చేయడం నేరంగా పరిగణిస్తామన్నారు. పై నిబంధనలను ఎవరైనా అతిక్రమించిన ఎడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆటో ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

## కళ్లే లలిత ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం

**ప్రజాశక్తి - విజయవాడ సిటీ :** అన్నీ దానాలలోకెల్లా అన్నదానం మిన్న అని కళ్లే లలిత ట్రస్ట్ అధ్యక్షుడు కళ్లే నాగేశ్వరరావు అన్నారు. కళ్లే లలిత జ్ఞాపకార్థం, కళ్లే లలిత వీధిలో ఆదివారం పేదలకు అన్నసమారాధన కార్యక్రమం

నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళ్లే లలిత ట్రస్ట్ అధ్యక్షుడు కళ్లే నాగేశ్వరరావు, డైరెక్టర్లు కళ్లే సీతా మహాలక్ష్మి, జయదుర్గ, మేఘవాణి పాల్గొని కళ్లే లలిత చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళ్లే నాగేశ్వరరావు మాట్లాడుతూ.. లలిత భౌతికంగా దూరమైన నాటి నుండి ప్రతి నెల 12వ తేదీన క్రమం తప్పకుండా గత 47 నెలలుగా పేదలకు సింగ్ నగర్ ప్రాంతంలోని కళ్లే లలిత వీధి వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. రానున్న రోజులో కళ్లే లలిత ట్రస్ట్ సేవల ద్వారా పేదలకు మరింత సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ ముప్పూరి హరీష్, ఎమ్.జశ్విన్, జి.ధ్రువన్ తదితరులు పాల్గొన్నారు.

# అంగట్లో అన్నీ కల్తీ..

**ప్రజాశక్తి-వత్సవాయి**

ప్రతి వస్తువు నేడు కల్తీ మయమవుతోంది. ప్రతిచోట కల్తీ దందా రోజురోజుకు పెరిగిపోతోంది. తాగునీరు మొదలు రోగమొస్తే జబ్బును నయం చేసే మందుల్లోనూ కల్తీ చేస్తున్నారు. వంటింట్లో వాడే అల్లం వెల్లుల్లి పేస్ట్ నుంచి వంట నూనెల వరకు అన్నింటిని కల్తీ చేస్తున్నారు. నకిలీ బియ్యం, టూత్ పేస్ట్‌లు, ఔషధాలను సైతం తయారు చేసి విక్రయిస్తున్నారు. మద్యాన్ని కూడా కేటుగాళ్లు వదలడం లేదు. డబ్బులు సంపాదించడానికి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. రైస్ మిల్లులో బియ్యంతోపాటు రేషన్ బియ్యం కలిపి కల్తీ చేస్తున్నారు. పాల పొడిలో నీళ్లు కలిపితే చిక్కటి పాలు.. అరటి కాడ గుజ్జుతో అల్లం వెల్లుల్లి పేస్టు, రసాయనాలు రుద్దితే నిగనిగలాడే పండ్లు, నాణ్యతలేని నూనెతో బిర్యానీ, నూడిల్స్.. నాన్‌వెజ్ వేపుళ్లు.. ఇలా చెప్పుకుంటే పోతే కాదేదీ కల్తీకి అనర్హం అన్నట్లుగా ఉంది. చివరికి ఏది తిందామన్నా అంతా కల్తీ మయమే. కొందరు వ్యాపారులు అత్యాశకు పోయి కల్తీ సరుకులు తయారు చేస్తూ జేబులు నింపుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో కల్తీ వస్తువులను ప్రజలకు అంటగడుతున్నారు.

రాష్ట్రంలో సంచలనం రేపిన నకిలీ మద్యం అంశం మిగతా నియోజకవర్గాల్లో కూడా ఉలిక్కిపడ్డాయి. వైన్ షాపు నిర్వాహకులు సిండికేట్గా ఏర్పడి స్టిక్కర్లు వేసి కల్తీ మద్యాన్ని అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారు. గ్రామాల్లో ఐదు బెల్టు షాపులు, మేజర్ పంచాయతీలు అయితే పది నుంచి 20 పైగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేసుకోవడం కోసం అనుమతులు ఇస్తున్నారు. దీంతో వైన్ షాప్ నిర్వాహకుల అండదండలతో బెల్ట్ షాపు నిర్వాహకులు కూడా గ్రామాల్లో జోరుగా మద్యం అమ్ముతున్నారు. ఒక్కో బాటిల్‌పై రూ.30 నుంచి రూ.50 రూపాయల వరకు మార్జిన్ ఉంచుకొని విక్రయిస్తున్నారు. ఆంధ్రా మందు అయితే ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవటం లేదు. తెలంగాణ మందు అయితే నెలవారి మామూళ్లకు అలవాటు పడి వదిలేస్తున్నారు. దీంతో బెల్ట్ షాపుల నిర్వాహకులు ఇదే అదునుగా భావించి గ్రామాల్లో యథేచ్ఛగా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. ఎక్సైజ్ శాఖ నిఘా లేక పోవడం, మామూళ్లకు అలవాటు పడడంతో మద్యం అమ్మకాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో కల్తీ మద్యం విక్రయాలు కూడా అదే స్థాయిలో పెరుగుతు న్నాయి.

కానరాని తనిఖీలు.. నమూనాల సేకరణ

ఫుడ్ ఇన్స్పెక్టర్లు మార్కెట్‌లో విక్రయించే నిత్యావసర వస్తువులను తరుచూ తనిఖీలు చేపట్టి నమూనాలను సేకరించాల్సి ఉంటుంది. ప్రతీ వస్తువు నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో నెలకు కనీసం ఆరు నమూనాలు తీసి ఎఫ్ఎసఎల్ (ఫుడ్ సేఫ్టీ లాబొరేటరీకి) పంపించాల్సి ఉంటుంది. అక్కడి నుంచి వచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలి. ఫిర్యాదులు వెల్లువెత్తిన సమయంలో మినహా అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. నామమాత్రంగా నమూనాలు సేకరించినా.. వాటి ఫలితాలు వచ్చేసరికి కేసు నీరుగారిపోతుంది. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కల్తీ దందాపై ఉక్కుపాదం మోపాలని పలువురు కోరుతున్నారు.

## కోటి సంతకాలతో ప్రభుత్వ కుట్రలు తిప్పికొడతాం : వైసిపి

**ప్రజాశక్తి-వత్సవాయి :** కోటి సంతకాలతో కూటమి ప్రభుత్వ కుట్రలు తిప్పికొడతామని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు నియోజకవర్గ పరిశీలకులు ఆళ్ళ చల్లారావు తెలిపారు. పెనుగంచిప్రోలు గ్రామంలోని దేరంగుల ఫంక్షన్ హాల్‌లో వైసిపి పెనుగంచిప్రోలు మండల విస్తృత స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఆ పార్టీ మండల అధ్యక్షులు పొన్నం కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా వైసిపి రాష్ట్ర కార్యదర్శి, జగ్గయ్యపేట నియోజకవర్గ పరిశీలకులు ఆళ్ళ చల్లారావు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్ (చిన్న), వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గాలేటి లక్ష్మణరావు పాల్గొన్నారు. అనంతరం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు పెనుగంచిప్రోలు మండల స్థాయిలో పార్టీ కమిటీల నియామకం క్రమశిక్షణతో త్వరితగతిన పూర్తి చేయాలని, సంస్థాగత బలోపేతంపై మండల, గ్రామ స్థాయి నాయకులు

దృష్టిపెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు గుడిమెట్ల శంకర్, జడ్పిటిసి సభ్యులు పూట్ల నాగమణి -నాగేశ్వరరావు, రాష్ట్ర ఎంపీపీ సంఘాల అధ్యక్షులు మార్కపూడి గాంధీ, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కన్నమాల శామ్యూల్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, రాష్ట్ర ప్రచార విభాగ కార్యదర్శి కాటెపల్లి రవి, జిల్లా ఉపాధ్యక్షులు కొత్తపల్లి పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మెకానిక్‌ల శ్రేయస్సు కోసం పని చేయాలి

**విజయవాడ :** కార్మికుల శ్రేయస్సు కోసం ప్రతి అసోసియేషన్ పనిచేయాలని టూ వీలర్స్ మెకానిక్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఎండి ఫిరోజ్, అధ్యక్షులుగా ఎన్ ఆంజనేయ దాసు తెలిపారు. ది విజయవాడ టూ వీలర్స్ మెకానిక్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం పడమట హైస్కూల్ రోడ్ యూనియన్ కార్యాలయంలో కమిటీ సభ్యుల సమావేశం ఆదివారం ఉదయం జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా ఎండి ఫిరోజ్, అధ్యక్షులుగా ఎన్ ఆంజనేయ దాసు, ఉపాధ్యక్షులుగా బి వెంకటరమణ, కార్యదర్శిగా ఎండి జానీ, కోశాధికారిగా ఇర్ఫాన్ బేగ్‌ను ఎన్నుకున్నారు. మిగతా కమిటీ సభ్యులను యధా విధంగా కొనసాగిస్తూ సమావేవం నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు మాట్లాడుతూ.. కార్మికుడికి ఎప్పుడైనా ఇబ్బంది వస్తే ఆ ఇబ్బంది తమకు వచ్చినట్టుగా అసోసియేషన్ సభ్యులు భావించి ఆ సమస్య పూర్తయ్యే వరకు పని చేస్తామని తెలిపారు.

## నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

**ప్రజాశక్తి-విజయవాడ**

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం (పిజిఆర్ఎస్) కార్యక్రమం సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, ఆయా సర్కిల్స్ కార్యాలయాల్లో జరుగుతుందని, ఈ అవకాశాన్ని నగర వాసులు వినియోగించుకోవాలని నగరకమిషనర్ ధ్యానచంద్ర కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ...విజయవాడ నగరపాలక సంస్థ కు సంబంధించిన సమస్యలన్నీ ప్రజలు తమ దగ్గరలోని కార్యాలయంలో సంప్రదించవచ్చని అన్నారు. ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని తెలిపారు. అధికారులందరూ జోనల్ కార్యాలయలలో తో పాటు ప్రధాన కార్యాలయంలో కూడా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్**

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం యథావిధిగా నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ ఓ ప్రకటనలో తెలియజేశారు. స్థానిక కలెక్టరేట్లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజలనుంచి ఫిర్యాదులను స్వీకరిస్తామని తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## బంజారా సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్**

బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో బందర్ రోడ్డులోని ఎంవివికె భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మహోత్సవం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్నాధ రావు, జాతీయ కమిటీ నాయకులు పి.ఎల్. రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి ఎన్నుకోబడ్డ నాయకులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ప్రెసిడెంట్ కోర్ర జగన్నాథం మాట్లాడుతూ బంజారాలులో ఐక్యమత్యం అవసరమని, రాబోయే తరాలకు బంజారా ప్రజలు ఏ ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా ఉండాలంటే మనలో ఐక్యత అవసరమని తెలిపారు. జాతీయ కమిటీ నాయకులు పి.యల్ రవీందర్ నాయక్ పాల్గొన్నారు. నూతనంగా ఎన్నిక కాబడ్డ స్టట్ ప్రెసిడెంట్ బానోత్ చక్రి నాయక్, స్టేట్ జనరల్ సెక్రెటరీ జటావత్ రాంబాబు మాట్లాడుతూ.. బంజారాల సమస్యలను సిఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లే సమస్యలు పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తామని తెలిపారు.

## ఇబ్రహీంపట్నంలో అన్నదానం

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం:** గ్యార్వీ పండుగ సందర్భంగా పశ్చిమ ఇబ్రహీంపట్నం మస్జిద్ వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా గౌసే ఆజం చిహ్నమైన జెండా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మస్జిద్ కమిటీ ప్రెసిడెంట్ షేక్ ముస్తఫా, ఉపాధ్యక్షులు షేక్ సర్వర్ సాహెబ్ (గోరె), కరీముల్లా, అలీఫ్ ఖాన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) :** కలెక్టరేట్ సమావేశ హాలులో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరి ంచినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక- మీకోసం కార్యక్రమం జరుగు తుందని జిల్లా కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చన్నారు. అలాగే మీకోసం కాల్ సెంటర్ నంబర్ 1100కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతో పాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చన్నారు.

## 15న అవనిగడ్డలో జాబ్‌మేళా

**ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు ఈ నెల15 బుధవారం అవనిగడ్డలోని ఎస్ వి ఎల్ క్రాంతి డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో హెటురో ల్యాబ్స్, జోయాలుక్కాస్ జ్యూవెలరీ, ఎస్ఎస్ ఇన్ఫ్రుమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, కోల్గేట్-పల్మోలివ్ ప్రైవేట్ లిమిటెడ్, ముక్కు ఫైనాన్సియల్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్, ఎల్ఎమ్ఎస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, మోహన్ స్పింటెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీనివాస ట్రాక్టర్స్-ఎస్కార్ట్స్ పవర్ ట్రాక్, అపోలో ఫార్మసి, పేటిఎమ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీల వారు పాల్గొంటున్నారని ఉపాధి అధికారి/డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్. పి.నరేష్ కుమార్ తెలిపారు. ఈ కంపెనీలలో గల ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, ఫార్మసి పూర్తిచేసిన 18 నుండి 35 సంవత్సరాల లోపు యువత అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 63006 18985, 79955 34572 నంబర్లను సంప్రదిం చాలని తెలిపారు.

## అన్నసమారాధన

**ప్రజాశక్తి-గూడూరు :** గూడూరు మండలంలోని పటాన్ పేట హజ్రత్ నిర్గన్షా ఔలియా వారి దర్గాలో నిర్వహించిన గ్యార్మీ వేడుకల్లో పెడన నియోజవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోతన స్వామి, దర్గా కమిటీ చైర్మన్ ఎండి యాసీన్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు గోపి నాగబాబు, ఎన్ ఎ బేగ్, బాసం శెట్టి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుకిరువైపులా పిచ్చిమొక్కలతో ఇబ్బందులు

రోడ్డుకిరువైపులా పెరిగిన ముళ్ల చెట్లు

**ప్రజాశక్తి-కోడూరు :** మండల పరిధిలోని దింటిమేరక గ్రామం నుండి హంసలదీవి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ముళ్ళ కంచెలు విపరీతంగా పెరిగి వాహనదారులకు ప్రయాణి కులకు ఇబ్బందికరంగా మారియి. ఉపాధి హామీ పథకం ద్వారా కార్మికులకు పని కల్పించి జంగిల్ క్లియరెన్స్ చేయించాలని సిపిఎం కోడూరు మండల కార్యదర్శి పోలాబత్తిన మోహన్రావు డిమాండ్ చేశారు. ఈ ముళ్ళ పొదల వలన రాత్రుల సమయంలో క్రిమి కీటకాలు, పాములు చేరి వాహనాలకు అడ్డం వచ్చే ప్రమాదం కూడా పొంచి ఉంది. కావున సంబంధిత అధికారులు స్పందించి ఉపాధి హామీ పథకం కార్మికుల ద్వారా పేరుకుపోయిన ముళ్ళ పొదలను తొలగించాలని కోరారు.

## గోకులం షెడ్డుకు శంకుస్థాపన

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ పంచాయతీ శివారు తిప్పపాలెంలో పాడి రైతు కమ్మిలి శ్రీనివాసరావుకు రెండు లక్షలతో మంజూరైన మినీ గోకులం షెడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ భూమి పూజ చేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తన శాఖ ద్వారా గ్రామీణ అభివృద్ధికి పల్లె సీమల ప్రగతి కి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో ఉండే వ్యవసాయదారులను, పాడి పరిశ్రమ బలోపేతం చేసేందుకు వారికి ఉపయోగపడే రీతిలో ఉపాధి హామీ పథకం నిధులతో అత్యధిక సబ్సిడీతో మినీ గోకులం షెడ్లు నిర్మిస్తున్నారని తెలిపారు. దీని ద్వారా పాడి గేదలు,

గొర్రెలు, మేకలు పెంపకాన్ని ప్రోత్సహించి వారి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా సహకారం అందిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం, పిఎసిఎస్ అధ్యక్షులు ఎలవర్తి చిన్న, ఎంపీటీసీ సభ్యులు బొప్పన భాను, ఏపీవో రవికుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు

రోడ్డును ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ బోడే ప్రసాదు

## రోడ్డు ప్రారంభం

**ప్రజాశక్తి-కంకిపాడు :** పెనమలూరు నియోజకవర్గం తాడిగడప మున్సిపాలిటీపరిధిలోని పోరంకి అలివేలు మంగ గార్డెన్స్‌లో పూర్తయిన అంతర్గత రోడ్డును ఆదివారం పెనమలూరు ఎంఎల్ఎ బోడే ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ 6 పథకాలలో భాగంగా సంక్షేమం, అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. అనేక ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడుతు న్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు కూటమి నేతలు పాల్గొన్నారు.

**వ్యర్థాల తొలగింపు :** పెనమలూరు నియోజకవర్గంలో వర్షాల కారణంగా కంకిపాడు బైపాస్ రోడ్డులో నిలిచిన నీటిని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తానే స్వయంగా నీటికి అడ్డు పడిన వ్యర్థాలను తొలగించారు.

## ప్రజల సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణం

**ప్రజాశక్తి-పామర్రు :** స్థానిక పంచాయతీ కార్యా లయం ఆవరణలోని ఒకటో సచివాలయం వద్ద ప్రభుత్వ నిధులు 6 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన సామాజిక మరుగుదొడ్ల సముదాయాన్ని పామర్రు ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కె.జ్యోతి అన్నారు. పామర్రు పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సలీం తో కలిసి అమె ఆదివారం మరుగుదొడ్ల సముదా యాన్ని పరిశీలించారు. జిల్లా నడిబొడ్డున ఉన్న పామర్రులో నాలుగు రోడ్ల జంక్షన్ ఉండడంవల్ల ఇక్కడ ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, ఆ ప్రాంతంలో మరుగుదొడ్ల నిర్మాణం సాధ్యం కానందున ప్రక్కనే ఉన్న పంచాయతీ కార్యాలయ ఆవరణలో మరుగుదొడ్ల సౌకర్యాను కల్పించామన్నారు.



మరుగుదొడ్లు పరిశీలిస్తున్న దృశ్యం

# ఉపాధ్యాయుల కార్ఖానా అవనిగడ్డ: మండలి

- 275 మంది నూతన ఉపాధ్యాయులకు సన్మానం

**ప్రజాశక్తిలి-అవనిగడ్డ :** ఉపాధ్యాయులను తయారు చేసే కార్ఖానాగా ఉభయ రాష్ట్రాలలో అవనిగడ్డకు ప్రత్యేక గుర్తింపు లభించిందని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. డీఎస్సీ శిక్షణ ద్వారా విద్యారంగ చరిత్రలో అవనిగడ్డ ఒక ప్రత్యేక స్థానాన్ని ,గుర్తింపు దక్కించుకుందన్నారు. ఆదివారం అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో నియోజకవర్గ మెగా డీఎస్సీ 2025లో ఉపాధ్యాయులు 275 మందికి బుద్ధ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయులు శీల సంపన్నులైన విద్యార్థులను తీర్చిదిద్ది దేశానికి ఉత్తమ పౌరులను అందించాలని పిలుపునిచ్చారు. సమాజాన్ని తీర్చిదిద్దే మహోన్నత వత్తిలో అడుగుపెడుతున్న సందర్భంగా శు భాకాంక్షలు తెలిపారు. అభివృద్ధి సంక్షేమంతో ఉద్యోగ కల్పన కూడా ప్రధానమని ఈ దశగా కూటమి ప్రభుత్వం ఆలోచించి 16 వేల కుటుంబాలకు మేలు చేస్తూ మెగా డీఎస్సీ అమలు చేసిందన్నారు. డిఇఒ పివిజే రామారావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం, ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ సన్నకా పూర్ణచంద్రరావు, విద్యానికేతన్ కోచింగ్ సెంటర్ చైర్మన్ పండ్రాజు లంకమ్మ ప్రసాద్, ఎంఈఓ లు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి కనకారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన ఉపాధ్యాయులు

## 'విద్యావికాస్'కు మరో గౌరవ పురస్కారం

**ప్రజాశక్తి - గుడివాడ :** విద్యావికాస్ డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మరో గౌరవ పురస్కారం అందుకున్నారు. రాష్ట్ర శ్రేష్ఠ విద్యా సేవా పురస్కారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈనెల 10వ తేదీ సాయంత్రం గుంటూరు ఎన్‌జివో ఫంక్షన్ హాల్‌లో ఎపిపిఎస్ఎ డెమోక్రటిక్ గుంటూరు (ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ డెమోక్రాటిక్ గుంటూరు) వారు ఏర్పాటు చేసిన గురుదేవోభవ కార్యక్రమంలో ఎంఎల్సి ఆలపాటి రాజాచే రాష్ట్ర శ్రేష్ఠ విద్యా సేవా పురస్కారంతో సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎపిపిఎస్ఎ డెమోక్రటిక్ రాష్ట్ర అధ్యక్షులు గొల్లపూడి మోహనరావు, కృష్ణా జిల్లా అధ్యక్షులు పుట్టి రామచంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు. విద్యావికాస్ డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు రాష్ట్ర శ్రేష్ఠ విద్యా సేవా పురస్కారం పొందిన సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విద్యావికాస్ ప్రైమరీ, హైస్కూల్ హెడమాస్టర్స్ ఆశీర్వాదం, నాగమల్లేశ్వర రావు, ఉపాధ్యాయులు, చిన్నారులు, వారి తల్లిదండ్రులు అభినందనలు తెలియజేసారు.

## కొండలమ్మను దర్శించుకున్న సినీ నిర్మాత

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని ఆదివారం చిరంజీవి క్రియేషన్స్ అధినేత, ధర్మ కార్య సంస్థ ప్రతినిధి, సినీ నిర్మాత చల్లపల్లి అమర్ ప్రసాద్ దర్శించుకున్నారు. ఆయన్ను ఆలయాధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహనరావు ఆయనను శేష వస్త్రంతో సన్మానించి అమ్మవారి లడ్డూ ప్రసాదాలను అందించారు. తొలుత ఆయన పేరిట వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

**వెంకటేశ్వరుడిని దర్శించుకున్న యాత్రికులు**

మండలంలోని డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు అధికసంఖ్యలో బారులు తీరారు. స్వామివార్లకు వేద పండితులు విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్ని మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. దేవస్థాన ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు పాల్గొన్నారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఆలయం వారు అన్న ప్రసాదాలను అందించేందుకు భారీ అన్నసమారాధనా కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాశక్తి-మొవ్వ :** మొవ్వ మండలం భట్ల పెనుమర్రు గ్రామంలో పంది వారి కుటుంబ సభ్యులు దేవర గంగానమ్మ ఆలయానికి ఆదివారం శంకుస్థాపన నిర్వహించారు. కృష్ణాజిల్లాలోని పంది ఇంటిపేరు గల కుటుంబ సభ్యులు అందించిన 30 లక్షల రూపాయలు సహాయ సహకారాలతో నిర్మిస్తున్న దేవాలయానికి మంత్రి పాలెం సర్పంచ్ పంది కృష్ణ, భట్ల పెనుమర్రు సర్పంచ్ భర్త మట్టా సతీష్‌తో పాటు గ్రామస్తులు, యాదవ నాయకులు పాల్గొన్నారు.

## రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల కేంద్రం శివారు కొత్త రెడ్డిగూడెంలో ఆర్ అండ్‌బి రోడ్డు పాడైపోయి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. కాగా ఆదివారం నాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ రామారావు, ఉప సర్పంచ్ స్పందించి గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టారు. దీంతో గ్రామ ప్రజలకు కొంత ఉపశమనం కలుగనుంది. పూర్తి స్థాయిలో రెడ్డిగూడెం నుండి విస్సన్నపేట వరకు రోడ్డు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి

ప్రజాశక్తి - తిరువూరు : హెల్మెట్ ధరించి వాహనాలు నడిపితే అనుకోకుండా జరగబోయే ప్రమాదాల నుండి సురక్షితంగా బయటప డవచ్చని తిరువూరు సెక్టార్ ఎస్సై సత్యనారాయణ తెలిపారు. స్థానిక బైపాస్ రోడ్డు వినాయక దేవలయం సెంటర్‌లో ఆదివారం ఆయన పోలీసు సిబ్బందితో కలిసి వాహన తనిఖీ చేసి రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనల పాటించాలని సూచించారు.

## నేడు సిజెఐపై దాడిని నిరసిస్తూ ఆందోళన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: సిజెఐపై దాడిని నిరసిస్తూ ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ఈ నెల సోమవారం విజయవాడలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంఆర్‌పిఎస్ నేతలు తెలిపారు. శనివారం రాత్రి మండలంలోని గౌరవరం, బండిపాలెం గ్రామాల్లో జగ్గయ్యపేట నియోజకవర్గం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి ఇంచార్జీలు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నేతలు మాతంగి దావీదు, చింతిరాల గోపి మాట్లాడుతూ.. సిజెఐపై దాడిని నిరసిస్తూ ఎంఆర్‌పిఎస్ పలు నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చిందని, అందులో భాగంగా ఈ నెల 13న విజయవాడలో భారీ నిరసన ర్యాలీతోపాటు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. 17న జగ్గయ్యపేటలో ర్యాలీ, 23న రాష్ట్ర రాజధానిలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలన్నిటిని జయప్రదం చేయాలని కోరారు.

## బేరాలు లేక దుకాణాలు వెలవెల

ప్రజాశక్తి-గంపలగూడెం: ఈ ఏడాది మాంసాహారానికి డిమాండ్ తగ్గింది. ప్రధానంగా గంపలగూడెం, తోటమూల పరిధిలో ఉన్న చికెన్, మటన్, ఫిష్ దుకాణాలు వెలవెల పోతున్నాయి. ధరల పెరుగుదల, పండని పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం, పండాల్సిన పంటలు కూడా అధిక వర్షాలకు దెబ్బ తినడం, తదితర కారణాలుగా చెప్పొచ్చు. గతంలో చికెన్, చాపలు అధికంగా అమ్మకాలు జరిగేవని, దుకాణదారులు చెబుతున్నారు. క్వింటాళ్ల స్థాయిలో జరిగిన అమ్మకాలు నేడు 50 కిలోలు సైతం అమ్మలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. కట్టలేరు వంతెన దెబ్బ తినడం, తరచు తాత్కాలిక రహదారి కొట్టుకుపోవడం వంటి కారణాలతో కనుమూరు, అనుములంక, కొత్తపల్లి, మామునూరు, భీమవరం, నారికెంపాడు, వినగడప తదితర గ్రామాల ప్రజలు కొనుగోలు చేసేందుకు రావడంలేదని దుకాణదారులు చెబుతున్నారు. తోటములకు, గంపలగూడెం గ్రామానికి తరచూ వచ్చి, పోయే పై గ్రామాలకు రహదారి సౌకర్యం లేనందుని మాకు కూడా ఈ సమస్య ఏర్పడిందని వాపోతున్నారు. జరగాల్సిన కాస్త బేరాలు అయినా ఏరు అవతల గ్రామాలు వస్తేనే అని చెబుతున్నారు. ఈ పరిస్థితులను పట్టి చూస్తే కట్టలేరు రహదారి అత్యంత అవసరమని అర్థమవుతుంది.

# ట్రంప్ విధానాలపై మోడీ మౌనం ప్రమాదం : సిపిఎం

ప్రజాశక్తి-వీరులపాడు :ట్రంప్ విధానాల వల్ల దేశానికి ప్రమాదం ఏర్పడుతుందని, రైతులు, విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతున్నా ప్రధాని మోడీ మౌనంగా ఉండటమే తప్ప వాటిని వ్యతిరేకించడం లేదనిసిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట కళ్యాణ్ విమర్శించారు. సిపిఎం వీరులపాడు మండల కమిటీ సమావేశం తొడదేవరపాడు గ్రామంలో ఆదివారం జరిగింది. సిపిఎం నాయకులు ఏ.స్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోట కళ్యాణ్ పాల్గొని మాట్లాడారు. ట్రంప్ విధానాల వల్ల జరిగే నష్టాన్ని ప్రజలకు తెలియజేసేందుకు సిపిఎం ఆధ్వర్యంలో సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఈ సందర్భంగా మండల కమిటీ పలు తీర్మానాలను ఆమోదించింది. జమ్మవరం నుండి పల్లంపల్లి వరకుతారు రోడ్డును వేయాలని, దామలూరు వద్ద ఉన్న కల్వేరుపై ఉన్న హైలెవెల్ బ్రిడ్జికి అప్రోచ్ రోడ్డు నిర్మించాలని, డ్రైనేజీ, మంచినీటి సమస్యను పరిష్కరించాలని, కల్తీ మద్యాన్ని నిలువరించి.. బెల్టు షాపులను అరికట్టాలని, రైతులు సాగుచేసిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, వర్షాల వల్ల నష్టపోయిన పత్తి, మొక్కజొన్న రైతులని ప్రభుత్వం ఆదుకోవాలని, పలు తీర్మాణాలను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చాట్ల రవి, మండల కమిటీ సభ్యులు గడ్డం ప్రభాకర్, పల్లెకంటి బాబు, శీను బాబు తదితరులు పాల్గొన్నారు.

## స్విమ్మర్లకు సన్మానం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మాస్టర్స్ ఆక్వాటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అక్టోబర్ 10న గుంటూరు మున్సిపల్ స్విమ్మింగ్ పూల్‌లో జరిగిన 8వ స్టేట్ ఛాంపియన్షిప్ పోటీల్లో జగ్గయ్యపేట డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్‌కు చెందిన 19 మంది స్విమ్మర్లు పతకాలు సాధించి జిల్లా గర్వకారణమయ్యారు. ఈ సందర్భంగా పతక విజేతలను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), సతీమణి శ్రీదేవి అమ్మాజీ ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కోచ్‌లు పొట్టబత్తిన పాండురంగారావు, పొట్టబత్తిన లక్ష్మి, సందీప్ టీం మేనేజర్ అన్ననీడి కళ్యాణ్‌లను అభినందించారు. ఈ సందర్భంగా విజేతలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మన శారీరక, మానసిక వికాసానికి తోడ్పడటమే కాకుండా, క్రమశిక్షణ, జట్టు మనసు, పోటీ భావనలను పెంపొందిస్తాయి. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మందడపు శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ కలలి నరేష్, కో-కన్వీనర్ యలదండి శ్రీనివాస్, తుమ్మడపు నారాయణ, భోగిరెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బైక్ అదుపుతప్పి వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి జగ్గయ్యపేట: బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన జగ్గయ్యపేటలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన షేక్ ఇర్ఫాన్ అనే వ్యక్తి షేర్ మహమ్మద్ పేట రోడ్డులో కుక్కని తప్పించబోయి ద్విచక్ర వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురైయ్యారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇర్ఫాన్‌ను జగ్గయ్యపేట పట్టణ ప్రభుత్వ వైద్యశాలలో చేర్చగా.. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చెరువు తూములో ఇరుక్కుని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఎ.కొండూరు : చెరువు తూములో ఇరుక్కుని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఎ.కొండూరు మండలం ఎ.కొండూరు తండా గ్రామ పంచాయతీలో ఆదివారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు గ్రామానికి చెందిన భూక్యా గోపయ్య (45) వరి పంటకు నీళ్లు పెట్టేందుకు చెరువులోకి దిగి తూము తీస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి తూములో ఇరుక్కొని ఊపిరాడక గోపయ్య మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని కుటుంబాన్ని సిపిఎం మండల కార్యదర్శి పానెం ఆనందరావు, మండల రైతు సంఘం నాయకులు ఆళ్ళ అమ్మిరెడ్డి, సిపిఎం నాయకులు భరోతు కేవళ, ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా గిరిజన నాయకులు కుమార్ నాయక్ సందర్శించి పరామర్శించారు. చెరువు తూము గేటు లాకులు సరిగా లేకపోవడమే కారణమని, ప్రభుత్వం వెంటనే స్పందించి మతుని కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-వీరులపాడు రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వీరులపాడు మండలం వెల్లంకి గ్రామానికి చెందిన గుడికందుల శాంతి కిరణ్ (29), మరో యువకుడైన ఆళ్ల రాముతో కలిసి వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై విజయవాడ వెళ్లి తిరిగి వస్తుండగా ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ వద్ద ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శాంతి కిరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆళ్ల రాముకు తీవ్ర గాయాలు కావడంతో ఇబ్రహీంపట్నంలోని నిమ్రా ఆస్పత్రిలో చేర్చారు. శాంతి కిరణ్‌కు ఐదేళ్ల కుమార్తె, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్.ఐ. రాజు తెలిపారు.

# నూతన ఉద్యోగులకు సత్కారం

ప్రజాశక్తి-గంపలగూడెం: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన డిఎస్‌సి, పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో నూతనంగా ఉద్యోగాలు పొందిన వారిని ఆదివారం ఘనంగా సత్కరించారు. స్థానిక తూర్పు దళితవాడకు చెందిన సదరు ఉద్యోగులను (కానిస్టేబుళ్లు ముగ్గురు, ఉపాధ్యాయులు 6) దళితవాడ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కోట వెంకట రామారావు ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కోట పుల్లమ్మ మాట్లాడుతూ ఏక కాలంలో ఒక్క దళితవాడలోనే 9 మంది ఉద్యోగులుగా మారడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోట దాసు, మాజీ సర్పంచ్ కోట కోటేశ్వరరావు, ఎంఈఎఫ్ అధ్యక్షులు బొల్లెపోగు కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం



ప్రజాశక్తి- నందిగామ : నారాయణ ఆంగ్లో స్కూల్ ఉపాధ్యాయులు మార్కపూడి స్వరూపను ఆదివారం నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సన్మానించారు. నంది గామలో గత 20 సంవత్సరాలుగా నారాయణ ఆంగ్లో వేదిక్ ప్రైవేట్ స్కూల్లో విద్యనందిస్తున్న టీచర్ మార్కాపూడి స్వరూప గతంలో వరుసగా పట్టణ, మండల, జిల్లా స్థాయిల్లో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా గుర్తింపు పొందారు. ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రతిభ కనపరిచారు. ఈ నేపథ్యంలో అప్సా డెమొక్రటిక్ ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ డెమోక్రటిక్ సంస్థ మిక్ ఇంజనీరింగ్ కళాశాలలో స్వరూపను ఎమ్మెల్యే సౌమ్య సన్మానించారు. స్వరూపను నారాయణ స్కూల్ యాజమాన్యం, ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

## అధ్వానంగా పెద్దవరం-బండిపాలెం రోడ్డు



ప్రజాశక్తి- నందిగామ

నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాలకు అనుసంధానంగా ఉన్న పెద్ద వరం-బండిపాలెం రహదారి గత కొన్ని సంవత్సరాల నుండి అధ్వానంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులు, వాహనదారులు ఈ రహదారి దాటి వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడుతున్నారు. పెద్దవరం బీరు ఫ్యాక్టరీ లారీలు, అక్రమ ఇసుక వ్యాపారం చేసే ఇసుక భారీవాహనాలు తిరుగు తుండటంతో రహదారి పూర్తిగా గుంటలు పడి నరకయాతన పడుతున్నారు.సుమారు ఐదు కిలోమీటర్ల వరకు రహదారి పూర్తిగా ధ్వంసం కావటంతో నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పాలకులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ సంయుక్తంగా చర్చించి ప్రభుత్వ నిధులతో ఈ రోడ్డును బాగు చేయాలని పలువురు బండిపాలెం, చెరుకుంపాలెం, పెద్దవరం ప్రజలు కోరుతున్నారు.

# అండర్ బైపాస్ రోడ్డులో పార్కింగ్

● వాహనదారుల తీవ్ర ఇబ్బందులు

అండర్ బైపాస్‌లో వాహనాలు పార్కింగ్ చేసిన దృశ్యం

**ప్రజాశక్తి-పామర్రు :** పామర్రు నుండి గుడివాడ వెళ్ళేరోడ్డులో ఉన్న మచిలీపట్నం-విజయవాడ హైవే ఫ్లైఓవర్‌క్రింద జాతీయ రహదారికి అడ్డంగా వాహనాలను,గొర్రెల మందలను నిలుపుదల చేయటం వల్ల ఈ రహదారిలో వెళ్లే వాహనదారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. ఫ్లైఓవర్ కింద ఉన్న రెండు మార్గాలలో ఒకదానిలో పామర్రు నుండి గుడివాడ వెళ్లే వాహనాలు మరో మార్గంలో గుడివాడ నుండి పామర్రు వచ్చే వాహనాలు నడుస్తాయి. పామర్రు నుండి గుడివాడ వెళ్లే రహదారిలో ఫ్లైఓవర్ క్రింద కానాలో పామర్రు పరిసర ప్రాంతాలకు ఎగుమతులు, దిగుమతులు చేసుకునే లారీలు, వ్యాన్లు తదితర వాహనాలు పార్కింగ్ చేసి పెడుతున్నారు.ఈ వాహనాలు గంటల తరబడి, రోజుల తరబడి ఉంటున్నాయి. అంతేకాక రోడ్ల వెంబడి ఖాళీ ప్రదేశాలలో గొర్రెల మందలను మేపేవారు ఈ బ్రిడ్జి కింద వాటికి సేద తీరుస్తున్నారు.

ఈ కారణంగా బ్రిడ్జి కింద నుండి వెళ్లే వారికి మార్గం లేక ప్రక్కనే ఉన్న వాహనాలు వచ్చే మార్గంలో వాహనాలకు ఎదురు వెళ్ళవలసి వస్తుంది. ఒకే ఖానాలో వాహనాలు ఎదురెదురుగా రావడం వల్ల పలు ప్రమాదకర సంఘటనలు తటిలో తప్పాయి.చాలా కాలంగా ఉన్న ఈ సమస్య అధికారుల దృష్టికి వెళ్లినప్పటికీ సంబంధిత అధికారులైన స్థానిక పోలీస్,నేషనల్ హైవే సెక్యూరిటీ సిబ్బంది,హైవే అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. రెండు హైవేలు కలిసే ఈ ప్రదేశం మీదుగా అనేకమంది అధికారులు ప్రజాప్రతినిధులు వచ్చిపోతుంటారు వారు కూడా పట్టించుకున్న దాఖలాలు లేవు. సంబందిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

మాట్లాడుతున్న దేవభక్తుని చక్రవర్తి

## ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : వైసిపి

**ప్రజాశక్తి-కంకిపాడు :** మెడికల్ కాలేజీల ప్రవేటికరణ, కూటమి ప్రభుత్వ మోసాలను జనాల్లోకి తీసుకెళ్లే విధంగా కార్యక్రమాలు గ్రామగ్రామాన, వాడవాడన నిర్వహించి ప్రతి ఒక్కరికి తెలియజేసే విధంగా పనిచేయాలని వైయస్సార్ పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్యాయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. ఆదివారం మాట్లాడుతూ కంకిపాడు మండలంలోని అన్ని గ్రామాలలో పార్టీ కమిటీ, అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించాలని, పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం మెడికల్ కాలేజీ ప్రయివేటికరణను వ్యతిరేస్తూ చేపట్టిన కోటి సంతకాల సేకరణ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు నియోజకవర్గ పరిశీలకులు అవుతు శ్రీనివాస్‌రెడ్డి, కంకిపాడు జడ్పీటీసీ బాకీ బాబు మరియు నియోజకవర్గ నాయకులు కొత్తపల్లి వెంకటేశ్వరావు,బీమవరపు నాగి రెడ్డి పాల్గొన్నారు.

**గోగులమూడిరాజుకు పరామర్శ :** మూల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజును దేవభక్తుని చక్రవర్తి పరామర్శించారు. ఇటీవల రాజు విధులు నిర్వహిస్తున్న కంపెనీలో ప్రమాదానికి గురై కుడికాలు తీవ్ర గాయాలుపాలై ఒక ప్రైవేటు హాస్పటల్లో చికిత్స పొంది స్వగ్రామం కుందేరులోని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా చక్రవర్తి వెళ్లి పరామర్శించారు. కుందేరు గ్రామ వైయస్సార్ పార్టీ నాయకులు, వైస్ ప్రెసిడెంట్ కలకోట ప్రసాద్ రెడ్డి,నాయకులు కొల్లి జైపాల్ రెడ్డి, గంట కామేశ్వరరావు, దేవరపల్లి వీర ప్రతాప్ పాల్గొన్నారు.

## నేటి నుంచి షాపింగ్ ఉత్సవ్ : జెసి

**ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :** జెడ్పి కన్వెన్షన్ హాల్లో సోమవారం ప్రారంభం కానున్న షాపింగ్ ఉత్సవ ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని సంయుక్త కలెక్టర్ ఎం నవీన్ అధికారులను ఆదేశించారు. ఆదివారం సంయుక్త కలెక్టర్ నగరంలోని వారి క్యాంపు కార్యాలయం నుండి సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ మాసోత్సవంలో భాగంగా షాపింగ్ ఉత్సవ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 13వ తేదీ నుండి 19వ తేదీ వరకు వారం రోజులపాటు పెద్ద ఎత్తున జడ్పీ కన్వెన్షన్ హాల్లో షాపింగ్ ఉత్సవం నిర్వహణ కోసం సత్వరమే అన్ని ఏర్పాట్లు సంబంధిత ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు ఈ ఉత్సవాల్లో పాల్గొంటున్న దష్ట్యా ఎక్కడ ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమస్యలు లేకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. ఇందులో భాగంగా వ్యవసాయం, ఆరోగ్యం, పరిశ్రమలు తదితర శాఖల ఆధ్వర్యంలో వ్యాపారస్తులు వారి ప్రదర్శనశాలలు ఏర్పాటు చేసి డిస్కౌంట్ కూపన్లు లేదా గిఫ్ట్ హంపర్లు ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆటోమొబైల్ డీలర్లు వారికి సంబంధించిన ప్రదర్శనశాలలు ఏర్పాటు చేసి గతంలో జిఎస్టి, ప్రస్తుతం జీఎస్టీ జిఎస్టి తేడా స్పష్టంగా తెలియజేస్తూ యోగదారులకు ఎంత లబ్ధి చేకూరుతుందో నేరుగా తెలియజేయడంతో పాటు బ్యానర్లపై వివరాలు పొందుపరచాలన్నారు. వాహనాలు ఏర్పాటు చేయుటకు అవసరమైన స్థలాన్ని ముందుగానే ఎంపిక చేసుకోవాలన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్లో మాణిజ్య పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ కల్పన, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద్ కుమార్, ఇన్చార్జి డిటిఓ శ్రీనివాస్, పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆర్ వెంకటరావు, మున్సిపల్ సహాయ కమిషనర్ గోపాలరావు పాల్గొన్నారు

## పామర్రులో పోస్టల్ డే

**ప్రజాశక్తి-పామర్రు :** పోస్టల్ డే ను పురస్కరిం చుకుని స్థానిక పోస్ట్ ఆఫీస్ కార్యాలయలో సిబ్బంది పోస్టుమాస్టర్ శ్రీనివాస్,నాగ సతీష్, లంకపల్లి విజయ్ కుమార్,ఆర్డి ఏజెంట్ లలి తాంబ తదితరులకు పామర్రు ఘంటసాల- ఎన్టీఆర్ కళాపీఠం సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సత్కారం జరిగింది. కళా పీఠం అధ్యక్షుడు కాటూరు వెంకట మురళీకృష్ణ కార్యదర్శి హేమంత్ రెడ్డి సభ్యులు కొల్లా బత్తుల సాల్మన్ పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యకు పరిష్కారం

**ప్రజాశక్తి- నందిగామ :** నందిగామ నియోజకవర్గం గుడిమెట్ల గ్రామంలో గత వైసిపి పాలకుల నిర్లక్ష్యంతో పిడబ్ల్యుఎస్ స్కీము కింద గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నడపబడుతున్న రక్షిత మంచినీరు ఫిల్టర్ బెడ్ మూలపడటంతో గ్రామస్తులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కృష్ణా నది పరివాహక ప్రాంతంలో ఉన్నా కూడా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు తాగునీటి సమస్య ఇటీవల ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆమె తక్షణమే స్పందించి స్థానిక క్రక్స్ బయో ఇథనాల్ కంపెనీ యాజమాన్యంతో చర్చలు జరిపి ఫిల్టర్ బెడ్ రీప్లేస్మెంట్ కోసం రూ.5 లక్షల నిధులను వారం రోజుల్లోనే గ్రామ సర్పంచ్ ఖాతాలో జమ చేయించారు. సంబంధిత చెక్కును తంగిరాల సౌమ్య ఆదివారం తన కార్యాలయంలో గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య గ్రామ ప్రజల తరపున కంపెనీ యాజమాన్యానికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ :** కంటి వెలుగు జీవన వెలుగు లాంటిదని, వాటిని జాగ్రత్తగా చూసుకోవాలని హ్యూమానిటీ ఫౌండేషన్ అధ్యక్షురాలు నూర్జహాన్ పేర్కొన్నారు. విజ్ఞానవేత్త, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని, స్థానిక సన్ స్టార్ స్కూల్ ప్రాంగణంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమం హ్యూమానిటీ ఫౌండేషన్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. శిబిరానికి హాజరైన ప్రజలను ఉద్దేశించి మానవతా స్వచ్ఛంద సంస్థ విద్యానిధి కన్వీనర్, సన్ స్టార్ స్కూల్ అధినేత పి శ్రీరామ్ మాట్లాడారు. 200 మంది పైగా ప్రజలు ఈ శిబిరానికి హాజరై, ఉచిత వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి ఉచితంగా మందులు, అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కంటి శుక్లాలు కు సంబంధించి శస్త్రచికిత్స అవసరమైనవారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ జి. భాను మూర్తి తెలిపారు. డివిజన్ ఇంచార్జి కోటి, కృష్ణ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సల్మా బేగం, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు కిషోర్ కుమార్, స్టార్ కళాశాల ప్రిన్సిపాల్ ఎమ్ ఎల్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కోడూరు :** కోడూరు గ్రామంలోని ప్రముఖ వైద్యులు యద్దనపూడి గోపాలకృష్ణ హాస్పిటల్ ఆవరణలో విజయవాడకు చెందిన అమరావతి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అమరావతి కంటి ఆసుపత్రికి చెందిన డాక్టర్ వేణు నాదెళ్ల, శైలజ కేతినేని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అసిస్టెంట్ డాక్టర్ పూర్ణచంద్రరావు ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. 150 మంది పైగా ప్రజలు పాల్గొని ఉచితంగా కంటి వైద్య పరీక్షలు పొందారు. ఈ సందర్భంగా యద్దనపూడి గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రతి నెలలో కూడా మా వైద్యశాల ఉచిత కంటి పరీక్ష లు నిర్వహించడంతోపాటు ఉచిత వైద్య శిబిరాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమరావతి కంటి ఆసుపత్రికు చెందిన రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంలో...

కోడూరులో...

## మున్సిపల్ కార్మికులకు బియ్యం పంపిణీ

**ప్రజాశక్తి- నందిగామ :** దీపావళి పండుగ సందర్భంగా నందిగామ మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఎలక్ట్రికల్, వాటర్ సప్లై, ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న శ్రామికులు 30 కుటుంబాలకు ఒక్కొక్కరికి 10 కేజీలు చొప్పున ఆదివారం ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. నవాబుపేట గ్రామ వాస్తవ్యులు పోలిశెట్టి సుధాకర్ జ్ఞాపకార్థం ఆయన భార్య పద్మావతి, కుమారులు పోలిశెట్టి వెంకటరావు, పోలిశెట్టి ఉపేంద్ర, పోలిశెట్టి సురేష్ సహకారంతో పంపిణీ చేశారు. నందిగామ ప్రముఖుడు పారేపల్లి సాయిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పబ్బతి జనార్ధన రావు, సముద్రాల ఈశ్వరయ్య,ఈదా వెంకటరెడ్డి,ఆళ్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

**ప్రజాశక్తి-వత్సవాలు :** బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ అన్నారు వత్సవాయి మండలం భీమవరం గ్రామానికి చెందిన గోడితాల మమత, సంగేపు లక్ష్మణకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తన నివాసంలో స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## పత్తి రైతులకు సూచనలు

**ప్రజాశక్తి-వత్సవాయి :** రసం పీల్చే పురుగులను గమనించి రైతులు నివారణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు అన్నారు. మండలంలో పలు గ్రామాల్లో ఆయన ఆదివారం సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు పత్తిపైర్లలో రసం పీల్చే పురుగులైన తామర పురుగు, పెనుబంక, తెల్ల దోమ, పచ్చ దోమ, అవకాశం ఉందని తెలిపారు. ఈ పురుగులు ఆకుల మీద రసం పిల్చటం వలన ఆకులు వెనుకకు ముడుచుకొని పోవటం, ఎండిపోవటం వంటి లక్షణాలు ఫైర్ లో కనిపిస్తాయని తెలిపారు. నివారణ కోసం మనోక్రోటోపాస్ 1.6 మిల్లీలీటర్లు ఆసిఫేట్ 2 గ్రాములు లేదా ఆచేట మీఫ్రిడ్ ఒక గ్రామ్ లీటర్ నీటిని కలిపి పిసికారి చేయాలని సూచించారు. ప్రతి రైతు పొలం గట్లపై కంది సాగు వేసుకోవాలని సూచించారు.

## దేవాలయానికి విరాళం

**ప్రజాశక్తి-వత్సవాయి :** బాపట్ల జిల్లా రేపల్లె మండలం నల్లూరిపాలెంకు చెందిన నలకుర్తి రాజేష్ బాబు, లక్ష్మీ తిరుపతమ్మ దంపతులు శ్రీ తిరుపతమ్మ అమ్మవారికి సుమారు రూ.రెండు లక్షల విలువచేసే బంగార కాసుల పేరు విరాళంగా ఆలయ ధర్మకర్త బెజవాడ శ్రీనివా సరావు, ఆలయ ఇన్స్పెక్టర్ బద్దుల కృష్ణమోహ న్‌లకు ఆదివారం అందజేశారు. వారికి ఆలయ అర్చకులు వేదపండితులతో వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## దుర్గ గుడికి పోటెత్తిన యాత్రికులు

**ప్రజాశక్తి - విజయవాడ సిటీ :** విజయవాడ ఇంద్రకీలాద్రి యాత్రికులతో కిటకిటలాడింది. శని, ఆదివారాలు వరుసగా సెలవు దినాలు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికులతో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆదివారం కోలాహలంగా మారింది. దసరా ఉత్సవాల అనంతరం భారీగా తరలివచ్చిన సందర్శకులతో ఇంద్రకీలాద్రిపై పండుగ వాతావరణం నెలకొంది. వేకువజాము నుంచి సర్వదర్శనం క్యూలైన్‌తోపాటు రూ.100, రూ.300, రూ.500 టిక్కెట్ల అమ్మకాలు నిలుపు వేసి అన్ని క్యూ లైన్లను ఉచిత దర్శన క్యూలైన్లుగా ప్రకటించి యాత్రికులకు త్వరితగతిన దుర్గమ్మ దర్శనం కలిగేలా చర్యలకు ఉపక్రమించారు. దుర్గగుడి చిన్న రాజ గోపురం, లక్ష్మీ గణపతి ఆలయం నుంచి ఘాట్ రోడ్డు ఓంకారం పాయింటు వరకు క్యూలైన్లలో యాత్రికులు బారులు తీరారు.కొండపై మధ్యాహ్నం రెండు గంటల వరకు సందర్శకుల రద్దీ కొనసాగింది. ఇంద్రకీలాద్రి పై రద్దీ నేపథ్యంలో అమ్మవారి దర్శనం యాత్రికులకు రెండు గంటలకు పైగా పట్టింది. దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ క్షేత్రస్థాయిలో పర్యటించి క్యూలైన్లో యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షించారు. యాత్రికుల రద్దీ దష్ట్యా అంతరాలయం రద్దుచేసి బంగారు వాకిలి నుంచి అమ్మవారి దర్శనం కల్పించారు.

## 18న కె ర్యాంప్ చిత్రం విడుదల

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్**

దీపావళి కానుకగా కె ర్యాంప్ చిత్రాన్ని విడుదల చేస్తున్నామని హీరో కిరణ్ అబ్బవరం తెలిపారు. కె ర్యాంప్ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా బందర్ రోడ్‌లోని ఒక హోటల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ ఈ చిత్రంలో ఊర మాస్ పర్ఫామెన్స్‌తో ప్రేక్షకులను అలరించేందుకు ఈ నెల 18న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు తెలిపారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడం సంతోషంగా ఉందన్నారు. సినిమా మొత్తం ఆశ భరితంగా ఉంటుందని, ప్రేమ సన్నివేశాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటాయని చెప్పారు. ఈ సినిమాలో యుక్తి తరేజ హీరోయిన్గా నటిస్తుందని తెలిపారు. గత ఏడాది దీపావళి కి విడుదల చేసిన కా చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేశారని అలాగే కె ర్యాంప్ చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేసి తనను ఆదరించాలని ఆయన కోరారు. చిత్ర ప్రమోషన్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. చేతన్ భరద్వాజ్ తన మూడో చిత్రానికి సంగీత దర్శకుడుగా వ్యవహరిస్తున్నారని, ఆయన సంగీత దర్శకత్వంలో వచ్చిన సినిమాలన్నీ విజయం సాధించాయని తెలిపారు. ప్రేక్షకులు పైరసీని ప్రోత్సహించకూడదని సినిమాను థియేటర్లలో మాత్రమే చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# వర్తమాన సమస్యలకు ప్రతిబింబంగా కవిత్వం

- 'కలువల కొలను' ఆవిష్కరణ సభలో వక్తలు

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** ఎంతో విలువైన సమాచారాన్ని మనకు అందించగల కళలు, సాహిత్యం పట్ల నేటి యువతరం ఆశక్తి చూపకపోవడం ప్రమాద సంకేతమని సుప్రసిద్ధ కవి, నవలా రచయిత సాగర్ శ్రీరామకవచం అన్నారు. ఆదివారం ఉదయం ఎక్స్ రే, సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహణలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్‌లో ప్రముఖ కవి కారంచేటి విజయ కుమార్(తెనాలి) రచించిన 'కలువల కొలను' కవితా సంపుటి ఆవిష్కరణ జరిగింది. పుస్తక ఆవిష్కరణ చేసిన శ్రీరామకవచం ప్రసంగం కొనసాగిస్తూ స్థితప్రజ్ఞత వాచకం కలువల కొలను కవితా సంపుటి అంటూ మంచి సాహిత్య అధ్యయనం మనిషిని ఉన్నతునిగా తీర్చిదిద్దుతుంది, వీరు ఈ కవితా సంపుటి ద్వారా సమకాలీన సమస్యలను ప్రతిబింబింపజేశారని అభినందించారు. సభకు ముఖ్య అతిథిగా జిఆర్కె పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షులు గోళ్ళ నారాయణరావు ప్రసంగిస్తూ ప్రజల్ని చైతన్యపరచి అభ్యుదయ పథంలో నడిపేదే కవిత్వం అన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ గుమ్మా సాంబశివరావు గ్రంథాన్ని సమీక్షిస్తూ విజయ కుమార్ కవిత్వం సరళమైన భాషలో అందరికి అర్థమయ్యేలా ఉందని ప్రశంసించారు. నేటి పరిస్థితులపై సరైన

అవగాహనతో విజయకుమార్ రచన 'కలువల కొలను' సాగుతుందని తెలిపారు. ఎక్స్ రే ఉపాధ్యక్షులు కందికొండ రవికిరణ్ సభాధ్యక్షుడుగా మాట్లాడతూ తమ సంస్థలో కవిత్వ రచనలో అక్షరాలు దిద్ది నేడు గ్రంథ రచయిత స్థాయికి ఎదగిన విజయకుమార్ కృషి అభినందనీయం అన్నారు. గ్రంథ రచయిత కారంచేటి విజయకుమార్‌కు సత్కారం జరిగింది. విజయకుమార్ గ్రంథ రచన నేపథ్యాన్ని వివరించి, తనను ప్రోత్సహించిన అందరికి ధన్యవాదములు తెలిపారు. తొలుత సంస్థ కోశాధికారి చామర్తి వెంకట సుబ్బయ్య స్వాగతం పలికి, చివరగా వందన సమర్పణ చేసారు. సంస్థ సభ్యులు గోపు రాము, డాక్టరు బి వసంత కుమార్, పొత్తూరి సీతారామారావు, గుర్రం ఏడుకొండలు, సామినేని శైలజ, విమలావతి, హారిక, వేణుగోపాల్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

## కోటక్ బిజ్‌ల్యాబ్స్ సీజన్-2 ప్రారంభం

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్**

కోటక్ బిజ్ ల్యాబ్స్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్ సీజన్-2 ప్రారంభిస్తున్నట్లు కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్ రీజినల్ ఇన్చార్జి రాజశేఖర్ కె ఒక ప్రకటనలో తెలిపారు. ఇది లోతైన మార్గదర్శకత్వం, మార్కెట్ యాక్సెస్, ఉత్ప్రేరక నిధులతో ప్రారంభ ఆదాయ దశ స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడానికి రూపొందించబడినడి అన్నారు. ఇది ప్రధానంగా డీప్-టెక్, సస్టైనబిలిటీ, క్లీన్ ఎనర్జీ, ఫిన్‌టెక్, డిజిటల్ టెక్నాలజీ, ఎడ్‌టెక్, అగ్రి టెక్, హెల్త్‌టెక్‌పై దష్టి సారిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం ఉత్తర, దక్షిణ, పశ్చిమ, మధ్య భారతదేశంలో తన దేశవ్యాప్త ఉనికిని విస్తరిస్తుందని, ఇప్పటికే భాగస్వాములుగా ఉన్న ఐఐఎంఏ వెంచర్స్, ఎన్ఎస్ఆర్సీఈఎల్-ఐఐఎం బెంగళూరు, టీ-హబ్‌లతో పాటుగా ఐఐటీ దిల్లీకి చెందిన ఫౌండేషన్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ ను కొత్త ఇంక్యుబే షన్ భాగస్వామిగా ఉందని పేర్కొన్నారు.

## ఎంజె నాయుడు హాస్పిటల్లో ఉచిత వైద్య శిబిరం

**ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ :** ప్రముఖ ఎంజే నాయుడు హాస్పిటల్స్ 39వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. ప్రజలకు అత్యాధునిక సదుపాయాలతో కూడిన వైద్యాన్ని అందించడం అభినందనీయమని మంత్రి కొల్లు రవీంద్ర ప్రశంసించారు. మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా ఆయన హాస్పటల్ యాజమాన్యానికి సూచించారు. అనంతరం హాస్పిటల్ చైర్మన్ ఎంజె నాయుడు, మేనేజింగ్ డైరెక్టర్ మాధవి మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయాలన్న ఉద్దేశంతో గత 39 సంవత్సరాలుగా అనేక ప్రపంచ స్థాయి అధునాతన వైద్య విధానాలతో నగర ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. 39వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ క్యాంప్‌లో డెర్మిటాలజీ, స్కిన్, ఆర్థోపెడిక్, జనరల్ వైద్య సేవలు వంటి అనేక వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు.

కౌతా పూర్ణానంద కళావేదికలో..

ఆశిష్ స్టూడియోలో...

## అలరించిన సంగీత విభావరులు

**ప్రజాశక్తి -కల్చరల్ :** చల్లని ఆదివారం సాయంత్రం వేళ విజయవాడ గాంధీనగర్లో పలు సంగీత విభావరి కార్యక్రమాలు అలరించాయి. కళాకారులకు బిరుదు ప్రదాన, సన్మాన కార్యక్రమాలు కూడా జరిగాయి. తెలుగు కళావాహిని, జిఆర్కె - పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి సంయుక్త నిర్వహణలో 'స్వరఝరి సాంస్కృతిక సేవా సమితి' (ఒంగోలు) సమర్పణలో కౌతా పూర్ణానందం కళావేదికపై జరిగిన సినీ సంగీత విభావరి శ్రోతలను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా స్వరఝరి అధ్యక్షురాలు తాళ్ళూరి శ్రీదేవి (ఒంగోలు)కి నిర్వాహకులు "సుస్వర గాన ప్రవీణ" బిరుదును ప్రదానం చేశారు. కార్యక్రమాన్ని చింతకాయల చిట్టిబాబు పర్యవేక్షించారు. వాస్తు పండిట్, ప్రముఖ గాయకుడు శ్రీనివాసరెడ్డి (గుంటూరు), శ్రీదేవి, అంజుస్వామి, ఎస్ కె అంజిబాబు, చరణ్ రాజ్, డేవిడ్ రాజు, ఆనంద్, స్వామి, ఏసుబాబు, సాయిబాబు, వేంకటేష్ వివిధ చిత్రాల్లోని పాటలను పాడి ప్రేక్షకుల కరతాళ ధ్వనులందుకున్నారు. కార్యక్రమానికి అతిథులుగా శింగంశెట్టి చంద్రశేఖర్, ప్రసూనారామన్, డాక్టర్ కమ్ముల రవి శేషుకుమార్, బివి వీరభద్రరావు తదితరులు విచ్చేశారు.

బాలు సినీ మెలోడీస్ ఆధ్వర్యంలో : ఆశిష్ స్టూడియోలో బాలు సినీ మెలోడీస్ (బీసీఎం) ఆధ్వర్యంలో "మీ హృదయాన్ని తాకే సంగీతం" సీజన్ - 6 కార్యక్రమం అలరించింది. బాలు, చందు, కరీమ, చిట్టి పర్యవేక్షణలో సంగీత విభావరి ఆహ్లాదంగా సాగింది. విమల, అనిత, జానీ, నాయుడు, రాఘవరావు, లక్ష్మి, మణికుమారి, శిల్ప, బాలాజీ తదితర సుమారు పాతికమందికి పైగా ఔత్సాహిక, ప్రొఫెషనల్ గాయనీ గాయకులు ఆయా చిత్రాల్లోని పలు సోలో, డ్యూయెట్ గీతాలు హృద్యంగా ఆలపించి ప్రేక్షకుల హర్షామోదాలు పొందారు.

జె.ఎన్.ఎస్. సరాగాలు సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో : భూధాత్రి ఇన్ఫ్రా అండ్ డెవలపర్స్ సౌజన్యంతో వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో జె.ఎన్.ఎస్. సరాగాలు సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో సంగీత విభావరి జరిగింది. గాయనీ గాయకులు పవన్ కుమార్, శ్రీనివాసరెడ్డి, ఝాన్సీరాణి, జె.శైలజ, పద్మ, మంగరాజు తదితరులు వివిధ సినిమాల్లోని పాటలు పాడారు. కార్యక్రమాన్ని ఎస్. ఝాన్సీలక్ష్మి (అధ్యక్షురాలు), ఎస్.బాజీ (ఉపాధ్యక్షులు), వెంకట్ (ఈసీఎం) పర్యవేక్షించారు.

## సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

**ప్రజాశక్తి - తిరువూరు :**

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆదివారం తిరువూరులోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. గంపలగూడెం, విస్సన్నపేట, ఏ.కొండూ రు, తిరువూరు మండలాలతో పాటు తిరువూరు పట్టణంలోని 50 మంది. లబ్ధిదారులకు రూ.23 లక్షల విలువైన చెక్కులను ఆయన నగర పంచాయతీ చైర్ పర్సన్ కొలికపోగు నిర్మల, పలువురు నేతలతో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.